




https://www.sreechakranews.com

# శ్రీచక్ర

SREECHAKRA TELUGU DAILY

సంపుటి 10 | సంచిక 47 | కర్నూలు | మంగళవారం 11 మార్చి 2025

పేజీలు : 08 | వెల రూ. 5.00

Published from Kurnool... Circulated by Andhra Pradesh, Telangana & New delhi







## తెలుగు రాష్ట్రాల్లో ముగిసిన నామినేషన్ల పర్వం...

అమరావతి/హైదరాబాద్, మార్చి 10(శ్రీచక్ర ): రెండు తెలుగు రాష్ట్రా ల్లో మార్చి 20న ఎమ్మె ల్యే కోటా ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీలు ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ చేసే అభ్యర్థుల పేర్లను ప్రకటించే శాయి. నేటితో నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ అవ డంతో ఆయా పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్సీ స్థానాలకు నామినేష న్లు దాఖలు చేశారు. ఎన్నికల రిటర్నింగ్అధికారికి నామినేషన్ పత్రాలను అంద జేశారు. దీంతో నామినేషన్ల ప్రక్రియ పూర్తి అయ్యింది. తెలంగాణలోని 5, ఆంధ్రప్ర దేశ్‌లోని 5 ఎమ్మెల్సీ స్థానా లకు ఎన్నికలు జరుగనున్నా యి. ఇక తెలంగాణలో ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్, శేరి సుభాష్ రెడ్డి, ఎగ్గె మల్లేశం, మీర్జా రియాజుల్ హసన్ పదవీకాలం మార్చి 29తో ముగియనుంది. ఇందులో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన ఎగ్గె మల్లేశం గత ఏడాదే కాంగ్రెస్‌లో చేరారు. మీర్జా రియాజుల్ హాసన్ మజ్లిస్ నేత కాగా, మిగిలిన ముగ్గురు బీఆర్ఎస్ నేతలు. అటు ఏపీలో జంగా కృష్ణమూర్తి, దువ్వారపు రామారావు, బీటీ నాయుడు, అశోక్‌బాబు, యనమల రామకృష్ణుడుల పదవీకాలం ఈ నెల 29తో ముగియ నుంది. దీంతో తెలంగాణలో ఐదు, ఏపీలో ఐదు స్థానాలకు ఇప్పటికే నోటిషన్ విడుదలైంది.

**ఆంధ్రప్రదేశ్‌లో :** ఏపీలో ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో జనసేన తరపున నాగబాబు, టీడీపీ తరపున బీటీ నాయుడు, బీద రవిచంద్ర యాదవ్, కావలి గ్రీష్మ, బీజేపీ అభ్యర్థిగా సోము వీర్రాజు పేర్లను ఖరారు చేశారు. ఇప్పటికే నాగబాబు నామినేషన్ వేయగా.. మిగిలిన నలుగురు అభ్యర్థులు ఈరోజు అసెంబ్లీ కమిటీ హాలులో నామినేషన్ వేశారు. పొత్తులో భాగంగా ఐదు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిలో జనసేన, బీజేపీ అభ్యర్థులు బరిలో దిగారు. ఇక మిగిలిన మూడు స్థానాల్లో ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ ప్రాంతాల నడుమ సమతూకం పాటిస్తూ చంద్రబాబు ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేశారు. మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో రెండింటిని బీసీలకు కేటాయించగా.. ఒక స్థానాన్ని ఎస్సీ మహిళకు ఇచ్చింది. తెలుగుదేశం తరఫున ఎమ్మెల్సీలుగా కావలి గ్రీష్మ, బీదా రవిచంద్ర యాదవ్, బీటీ నాయుడు అసెంబ్లీ ఆవరణలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేశారు. అభ్యర్థులకు మద్దతుగా నారా లోకేష్, అచ్చెన్నాయుడు, కందుల దుర్గేష్, విష్ణుకుమార్ రాజు, రఘురామకృష్ణంరాజు, పితాని సత్యనారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పల్లా శ్రీనివాస్, టీడీ జనార్దన్, కురుగొండ్ల రామకృష్ణ, అమర్నాథ్ రెడ్డి తదితరులు వచ్చారు. అలాగే అసెంబ్లీ కమిటీ హాల్లో బీజేపీ అభ్యర్థి సోమివీర్రాజు నామినేషన్ దాఖలు చేశారు. మంత్రులు కందుల దుర్గేష్ ,సత్య కుమార్ యాదవ్, పల్లా శ్రీనివాసరావు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇక రేపు నామినేషన్లను పరిశీలించనున్నారు. ఈ నెల 13న నామినేషన్‌ల ఉపసంహరణకు చివరి తేదీ. ే విపక్షం నుంచి పోటీ లేనందునఎన్నిక ఏకగ్రీవం అయ్యే అవకాశం ఉంది.




**తెలంగాణలో :** తెలంగాణలో ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు గాను మూడు స్థానాల్లో కాంగ్రెస్ తమ అభ్యర్థుల పేర్లను ప్రకటించింది. ఎమ్మెల్సీ అభ్యర్థులుగా అద్దంకి దయాకర్, శంకర్ నాయక్, విజయశాంతి పేర్లు ఖరారయ్యాయి. పొత్తులో భాగంగా సీపీఐకి ఒక స్థానాన్ని కేటాయించింది. సీపీఐ తరఫున నెల్లికంటి సత్యాన్ని బరిలోకి దిగారు. వీరంతా నేడు ఎమ్మెల్సీ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మంత్రులు, ఎమ్మెల్యేలు, సీపీఐ నేతలు హాజరయ్యారు. అలాగే బీఆర్ఎస్ తన అభ్యర్థిగా దాసోజు శ్రవణ్ కుమార్ పేరును ఖరారు చేయడంతో ఆయన నామినేషన్ వేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు పాల్గొన్నారు. ఐదు స్థానాలకు ఐదు మంది అభ్యర్థులు ఎమ్మెల్యేల సంతకాలతో నామినేషన్లు దాఖలు చేశారు. ముగ్గురు ఇండిపెండెంట్‌లు ఒక్క ఎమ్మెల్యే సంతకం లేకుండా నామినేషన్ దాఖలు చేశారు. రేపు (మంగళవారం) నామినేషన్ల పరిశీలించనున్న అధకారులు.. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నామినేషన్లను తిరస్కరించనున్నారు. 13న ముగియనున్న నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియనుండగా.. ఆ తర్వాత అధికారికంగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఈసీ వెల్లడించనుంది

## ఐగాట్ కర్మయోగి యాప్ తో ఉద్యోగుల నైపుణ్యత వెలికితీత

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

నంద్యాల , మార్చి 10-(శ్రీచక్ర) ఐగాట్ కర్మయోగి ద్వారా ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా ఐగాట్ కర్మయోగి యాప్, పి4 సర్వేలపై జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన ఐగాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్లైన్ ట్రైనింగ్) కర్మయోగి యాప్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగులు తమ నైపుణ్యాలను పెంపొందించుకునే అవకాశం కల్పించిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటూ నైపుణ్య మెలకువలను తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. పి4 సర్వే ద్వారా ప్రజల అభిప్రాయాలను సేకరించండి : జిల్లా కలెక్టర్×పి4 సర్వే ను క్యూర్ కోడ్ స్కాన్/లింక్ ద్వారా లాగిన్ అయ్యి ఉత్పన్నమయ్యే 11 ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అందులోని పథకాలకు, దాతలకు, స్వీయకర్తలకు ఎలాంటి




పేర్లు పెట్టాలన్న అంశాలపై ప్రశ్నలు ఉంటాయన్నారు. అదే విధంగా ఏ రంగానికి సంబంధించైనా కూడా ప్రజలు కొత్తగా ఏవైనా సలహా, సూచనలు కూడా ఇచ్చే అవకాశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. అధికారులు అందరూ సదరు సర్వేను ఈనెల 25వ తేదీలోగా పూర్తి చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగాది నాటికి గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా పి4 సర్వేను ప్రారంభించే అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ వివరించారు.

## 12 నుంచి బడ్జెట్ సమావేశాలు మొదలు

హైదరాబాద్, మార్చి 10,(శ్రీచక్ర) అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో ఈనెల 11న మధ్యాహ్నం ఒంటి గంట కు బీఆర్ఎస్ శాసనసభాపక్ష సమావేశం జరగనుంది. పార్టీ అధినేత కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరగనున్న సమావేశానికి పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరుకానున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత కేసీఆర్ అసెంబ్లీకి హాజరు కాలేదు. గత బడ్జెట్ ప్రవేశ పెట్టిన రోజు అసెంబ్లీకి హాజరై ఆ తర్వాత మళ్లీ అడుగుపెట లేదు. ఈ నెల 12 నుంచి జరగనున్న బడ్జెట్ సమావేశాలకు మాత్రం హాజరుకావాలని కేసీఆర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు పార్టీ నేతలకు తెలియజేసినట్లు సమాచారం. పార్టీ శాసనసభ పక్ష సమావేశాన్ని హైదరాబాద్లో నిర్వహించనున్నట్లు ప్రకటన రావడంతో కేసీఆర్ అసెంబ్లీకి రావడం ఖాయమైనట్లేనని



తెలుస్తోంది. ఒకవేళ కేసీఆర్ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకపోతే ఎర్రవల్లిలోని ఫామ్ హౌస్ లోనే శాసనసభా పక్ష సమావేశం జరిగేదని పార్టీ నేతలు చెబుతున్నారు. బడ్జెట్ సమావేశాల్లో పాల్గొనేందుకే కేసీఆర్ హైదరాబాద్ వస్తున్నారని.. అందుకే ఇక్కడే పార్టీ ఎమ్మెల్యేల సమావేశం ఏర్పాటు చేసినట్లు చెబుతున్నారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై ఎమ్మెల్యేలకు కేసీఆర్ దిశా నిర్దేశం చేయనున్నారని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కార్‌ను ఎండగడుతారని చర్చ సాగుతోంది. 12వ తేదీ నుంచి మొదల్యే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈ నెల 27 వరకు జరిగే అవకాశం ఉంది. బుధవారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగానే గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మరుసటి రోజు రెండు సభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు ప్రవేశపెట్టి ఆమోదం తెలుపుతారు. కానీ, బడ్జెట్ ఏ రోజు ప్రవేశ పెడుతారు, పద్దులపై ఎన్ని రోజులు చర్చిస్తారు అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

## రాజధాని అమరావతికి రుణాలు..

### కేంద్రం కీలక ప్రకటన



న్యూఢిల్లీ,మార్చి10 (శ్రీచక్ర) రాజధాని అమరావతి నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలు ఆంధ్రప్రదేశ్ ఎఫ్ఆర్‌బీఎం పరిమితిలోకి రావని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి స్పష్టం చేశారు. ఈ రుణాలను ఆంధ్రప్రదేశ్ అప్పుల పరిమితి?కి లెక్కించకూడదని నిర్ణయించినట్లు పార్లమెంట్‌కు ఆయన తెలిపారు. సోమవారం లోకసభలో వైసీపీ సభ్యుడు అడిగిన ప్రశ్నకు మంత్రి పంకజ్ చౌదరి లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. ఆ క్రమంలో అందుకు సంబంధించిన అన్ని వివరాలను ఆయన సభలో వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానిగా ప్రకటించిన అమరావతి నిర్మాణానికి విదేశీ సంస్థల నుంచి తీసుకునే రుణాలు ఏపీ ఆ రాష్ట్ర అప్పుల పరిధిలోకి రావని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. అలాగే రాజధాని అమరావతి ప్రాంతంలో అత్యవసర మౌలిక వసతుల కోసం ఇప్పటి వరకు ప్రత్యేక సాయం... గ్రాంట్స్ కింద రూ. 2,500 కోట్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు. అమరావతి సమీకృత పట్టణాభివృద్ధి కార్యక్రమం, అమరావతి సమ్మిళిత,సుస్థిర రాజధాని నగర అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రపంచబ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకుల నుంచి రూ. 6,700 కోట్ల చొప్పున రుణ ఆమోదం కోసం సాయం చేశామని ఆయన సోదాహరణగా గణాంకాలతో సహా వివరించారు. ప్రపంచ బ్యాంకు రుణం ఈ ఏడాది జనవరి 22 నుంచి.. అలాగే ఆసియా అభివృద్ధి బ్యాంకు రుణం ఈ ఏడాది ఫిబ్రవరి 10 నుంచి అమల్లోకి వచ్చాయన్న కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంజక్ చౌదరి లోక్ సభ సాక్షిగా ప్రకటించారు. అయితే ఈ రుణాలకు సంబందించిన పంపిణీ ఇంకా జరగలేదని తెలిపారు. ప్రస్తుత ప్రాజెక్టు మొత్తం వ్యయంలో 10 శాతానికి మించకుండా..గరిష్టంగా రూ. 1,500 కోట్లు, ప్రత్యేక సాయంగా..గ్రాంట్‌గా ఆంధ్రప్రదేశ్‌కు "కౌంటర్ పార్ట్ ఫండింగ్" సమకూర్చాలని కూడా నిర్ణయించామని ఆయ తెలిపారు. ఈ ప్రాజెక్టుకు అందిస్తున్న రుణాన్ని ఆంధ్రప్రదేశ్ రుణ పరిమితిలో లెక్కించ కూడదని నిర్ణయించినట్లు ఆ సమాధానంలో ఆయన క్లియర్ కట్‌గా స్పష్టం చేశారు. రుణం మంజూరు చేసేటప్పుడు రూపొందించిన మార్గదర్శకాలు, షరతులను అనుసరించి నిధుల వినియోగ పర్యవేక్షణ జరుగుతుందని తన లిఖిత పూర్వక సమాధానంలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పేర్కొన్నారు. గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభత్వానికి ప్రజలు పట్టం కట్టారు. దీంతో చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. ఆ క్రమంలో రాజధాని అమరావతి, రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా కేంద్రం నుంచి సహాయ సహకారాలు తీసుకోంటుం ది. అలాగే ప్రపంచ బ్యాంక్ నుంచి నిధులు, ఆసియా అభివృద్ధి బ్యాంక్ నుంచి సైతం రుణాలు పొందేందుకు చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించిన అన్ని ఒప్పందాలు ఇప్పటికే ఖరారయ్యాయి. మరోవైపు ఏపీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ప్రధాని మోదీ, కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతోపాటు పలువురు కేంద్ర మంత్రులు ఇప్పటికే పునరుద్ఘాటించారు. అదీకాక.. గత వైసీపీ పాలనలో రాష్ట్రానికి మూడురాజధానులంటూ ప్రకటన చేసి.. రాష్ట్రాభివృద్ధిని అధ:పాతాళానికి నెట్టేశారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన అనంతరం ఏపీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు సారథ్యంలో వ్యూహాత్మకంగా అడుగు వేస్తోంది.

## మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తా : రేవంత్



హైదరాబాద్: తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ భయపెడతారనే ప్రభుత్వానికి బిజెపి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సహకరించడంలేదని సిఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. మనోహర్ లాల్ ఖట్టర్ వచ్చేది కూడా కిషన్ రెడ్డికి తెలియదా? అని ప్రశ్నించారు. ఆర్ఆర్ఆర్ ఇచ్చామని మోదీ అన్నారని, అదే ఇవ్వమంటున్నామని రేవంత్ అన్నారు. "జైపాల్ రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తోంది?కిషన్ రెడ్డి తెచ్చిన మెట్రో ఎక్కడ?" అని ధ్వజమెత్తారు. ప్రాజెక్టులు ముందుకెళ్లకుండా అడ్డుకుంటోంది బిజెపి ఎంపిలేనని మండిపడ్డారు. మూసీకి నిధులు తెస్తే కిషన్ రెడ్డికి సన్మానం చేస్తానని రేవంత్ ఎద్దేవా చేశారు. అఖిలపక్ష సమావేశానికి పిలిస్తే కిషన్ రెడ్డి రాలేదని ఆరోపించారు. 39 సార్లు కాదు.. 99 సార్లు ఢిల్లీకి వెళ్తానని, వెళ్లిన ప్రతిసారి రాష్ట్రానికి కావాల్సినవి తెచ్చుకుంటానని తెలిపారు. తెలంగాణకు కావాల్సిన అనేక అంశాలను క్లియర్ చేసుకుని వచ్చానని, పభావం వల్లే అన్ని పార్టీలు బిసిలకు టికెట్లు ఇచ్చాయన్నారు.

శ్రీచక్ర
మంగళవారం 11 మార్చి 2025

# సంపాదకీయం

## చివరి దశకు కశ్మీర్ వ్యవహారం

కశ్మీర్ వ్యవహారం ఫైనల్ స్టేజ్‌కు చేరుకోబోతుందా..? పరిస్థితులు చూస్తుంటే.. అలాగే కనిపిస్తోంది. త్వరలోనే పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో సహా కశ్మీర్ అంశంలో పాకిస్తాన్‌కు భారత్ బుద్ధి చెప్పే తరుణం ఆసన్నమయ్యింది. పాక్ ఆక్యూపైడ్ కశ్మీర్ కేంద్రంగా భారత్‌ను ఇబ్బందిపెట్టడానికి అంతర్జాతీయ వేదికలను పాకిస్తాన్ ఎక్కువగా ఉపయోగిస్తోంది. కశ్మీర్ అంశాన్ని శాంతి చర్చలతో పరిష్కారించాలని పాక్ ప్రధాని ఇటీవల భారత్‌కు పిలుపునిచ్చారు. ఈ తరుణంలో.. అసలు భారత్ ఏమనుకుంటుందో అనే సందేహం పాక్ మెదణ్ని తొలిచేస్తున్నట్లుంది. తాజాగా, భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ లండన్‌లో ఓ కార్యక్రమానికి అటెండ్ అవ్వగా.. అక్కడ ఒక పాకిస్తాన్ జర్నలిస్టు.. మంత్రి జైశంకర్‌ని ఉద్దేశించి ప్రశ్న అడిగారు. అయితే, ఈ ప్రశ్నలో పాక్ జర్నలిస్ట్ విచిత్రమైన వాదన చేశారు. కశ్మీర్‌ను భారత్ చట్టవిరుద్ధంగా ఆక్రమిస్తుందని అన్నారు. అందుకే, కశ్మీరీలు భారత్‌కు వ్యతిరేకంగా ఆందోళనలు చేస్తున్నారని ఆరోపించారు. ఇక, "కశ్మీర్‌పై శాంతి ఒప్పందం కోసం అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ సహాయం తీసుకుంటారా..? ప్రధాని మోడీ.. ట్రంప్‌కు మంచి స్నేహితుడే కాబట్టి, ఆ దిశగా ఏదైనా ప్రయత్నాలు జరగొచ్చా..?" అంటూ పాకిస్తాన్ టోన్‌లో సదరు జర్నలిస్ట్ ఆసక్తికర ప్రశ్నను లేవనెత్తారు. అయితే, జర్నలిస్ట్ ఉద్దేశం అర్థమైన మంత్రి జైశంకర్ అంతే స్పష్టంగా ఆన్సర్ ఇచ్చారు. లండన్‌కు చెందిన థింక్ ట్యాంక్ 'చాథమ్ హౌస్'లో జరిగిన ఈ కార్యక్రమంలో.. కశ్మీర్ సమస్యకు పరిష్కారం ఏంటనే అంశంలో మంత్రి జైశంకర్ 'టిట్ ఫర్ ట్యాట్'లా సమాధానం ఇచ్చారు. భారత ప్రభుత్వం ఇప్పటి వరకూ కాశ్మీర్ విషయంలో చాలా మంచి పనులే చేసిందని అన్నారు. అలాగే, కశ్మీర్‌లో ఇప్పటికే చాలా సమస్యలు పరిష్కరించామని తెలిపారు. అందులో మొదటి అడుగు ఆర్టికల్ 370ని తొలగించడమనీ.. కాశ్మీర్‌లో వృద్ధి, ఆర్థిక కార్యకలాపాలు, సామాజిక న్యాయాన్ని పునరుద్ధరించడం రెండవ అడుగనీ.. భారీగా పెరిగిన ఓటింగ్‌తో ఇటీవల ఎన్నికలు నిర్వహించడం మూడవ అడుగని అన్నారు. ఇక, చట్టవిరుద్ధంగా పాకిస్తాన్ ఆక్రమించిన 'కాశ్మీర్‌లోని దొంగిలించిన భాగాన్ని' భారతదేశానికి తిరిగి ఇచ్చిన తర్వాత కాశ్మీర్ సమస్య "పరిష్కరించబడినట్లే" అని జైశంకర్ స్పష్టం చేశారు. జమ్మూ కశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలకు సంబంధించిన భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకోవడం మాత్రమే కశ్మీర్ అంశంలో పరిష్కరించాల్సిన ఏకైక సమస్య అని భారత్ పలు సందర్భాల్లో చెప్పింది. జమ్మూ కాశ్మీర్‌లోని దాదాపు 78 వేల చదరపు కిలోమీటర్ల భారత భూభాగాన్ని పాకిస్తాన్ అక్రమంగా ఆక్రమించుకుందన్న మాటను పదే పదే చెబుతోంది. 1994 పార్లమెంటు తీర్మానం కూడా ఏకగ్రీవంగా ఆమోదించారు. ఇందులో భారత్ వైఖరి స్పష్టంగా తెలియజేశారు. "జమ్మూ కశ్మీర్, లడఖ్‌కు సంబంధించినంత వరకూ మొత్తం భూభాగం భారతదేశంలో అంతర్భాగంగా ఉండేవి, ఉన్నాయి, ఉంటాయి అని" పేర్కొన్నారు. అలాగే, "పాకిస్తాన్ చట్టవిరుద్ధంగా, బలవంతంగా ఆక్రమించుకున్న అన్ని ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని" ఈ తీర్మానం పిలుపునిచ్చింది. మంత్రి జైశంకర్ లండన్‌లో తాజాగా చేసిన వ్యాఖ్యలకు పాకిస్తాన్ నుండి తీవ్రమైన స్పందన వచ్చింది. పాకిస్తాన్ విదేశాంగ కార్యాలయ ప్రతినిధి షఫ్కత్ అలీ ఖాన్ మాట్లాడుతూ.. "మార్చి 5న భారత విదేశాంగ మంత్రి జమ్మూ కాశ్మీర్‌పై చేసిన వ్యాఖ్యలను పాకిస్తాన్ తిరస్కరిస్తుందని అన్నారు. భారతదేశం గత 77 సంవత్సరాలుగా జమ్మూ కాశ్మీర్‌ను ఆక్రమిస్తుందనీ.. భారత్ ఆక్రమించిన ఆ ప్రాంతంలోని పెద్ద భూభాగాలను ఖాళీ చేయాలని" డిమాండ్ చేశారు. కట్ చేస్తే ఫ్లాష్ బ్యాక్‌లో ఇటీవల.. పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ దీనికి విరుద్ధంగా శాంతి మంత్రం వల్లించారు. కశ్మీర్ అంశం సహా భారత్‌తో ఉన్న అన్ని సమస్యలను సంప్రదింపుల ద్వారా పరిష్కరించుకోవాలని కోరుకుంటున్నట్లు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ వెల్లడించారు. ఐక్యరాజ్యసమితిలో చేసిన వాగ్దానాలను భారత్ నెరవేర్చి, చర్చలకు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చారు. ఫిబ్రవరి ప్రారంభంలో.. "కాశ్మీర్ సంఘీభావ దినోత్సవం" సందర్భంగా పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ శాసనసభ ప్రత్యేక సమావేశంలో ఈ వ్యాఖ్యలు చేశారు. కశ్మీర్ యావత్తూ భారత భూభాగమని మంత్రి జైశంకర్ చెప్పడం కొత్తేమీ కాదు. పాకిస్తాన్ అక్రమిత కాశ్మీర్ భారతదేశంలో భాగమని? ప్రతి భారతీయ రాజకీయ పార్టీ ఖూఐ భారతదేశానికి తిరిగి వచ్చేలా చర్యలు తీసుకోడానికి కట్టుబడి ఉందని చెప్పారు. ఆ మధ్య, న్యూఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో జరిగిన సంభాషణలో కూడా జైశంకర్ దీన్ని స్పష్టం చేశారు..పాకిస్తాన్ ఆక్రమణలో ఉన్న జమ్మూ కశ్మీర్ భాగాన్ని తిరిగి తీసుకుంటామంటే.. దాన్ని ఎవరు ఆపుతున్నారు? దాన్ని తిరిగి తీసుకోవద్దని కశ్మీర్ ప్రజలు ఎప్పుడైనా చెప్పారా?" అని ముఖ్యమంత్రి రాష్ట్ర అసెంబ్లీలో వెల్లడించారు. కార్గిల్ యుద్ధంలో కూడా భారతదేశానికి పీఓకెను తిరిగి స్వాధినం చేసుకునే అవకాశం వచ్చిందనీ.. కానీ, అలా చేయడంలో భారత్ ఎందుకు విఫలమైందని అబ్దుల్లా అడిగారు. ఇక, కేంద్రం పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకునే క్రమంలోనే.. ప్రస్తుతం చైనా నియంత్రణలో ఉన్న జమ్మూ-కశ్మీర్ భాగాన్ని కూడా తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఒమర్ అబ్దుల్లా కోరారు. ఇటీవల చైనాతో భారతదేశ సంబంధం కాస్త మెరుగుపడుతుందని మంత్రి జైశంకర్ వెల్లడించారు. చైనా గురించి, మాట్లాడుతూ? టిబెట్‌లో కైలాస పర్వత తీర్థయాత్ర మార్గం ప్రారంభంతో సహా అక్టోబర్ 2024 నుండి జరిగిన కొన్ని పరిణామాలు చైనా-భారత్ సంబంధాలను మెరుగుపరుస్తున్నాయని అన్నారు. "ప్రపంచంలో రెండు బిలియన్లకు పైగా జనాభా కలిగిన ఏకైక దేశాలుగా చైనాతో మాకు చాలా, చాలా ప్రత్యేకమైన ఉందనీ.. రెండు దేశాల ఆసక్తులను గౌరవించే, సున్నితత్వాలను గుర్తించే, ఇద్దరికీ ఉపయోగకరంగా భారత్ కోరుకుంటుంది" అని అన్నారు.

# వైయస్ ఆర్ నగర్ అభివృద్ధి కి కట్టుబడి ఉన్నా: ఎన్ ఎమ్ డి ఫిరోజ్

### ఫిరోజ్‌ను ఘనంగా సన్మానించిన కాలనీ వాసులు

నంద్యాల , మార్చి 10(శ్రీచక్ర) -వైయస్ ఆర్ నగర్ అభివృద్ధి కి కట్టుబడి ఉన్నామని జిల్లా కార్యదర్శి ఎన్ ఎమ్ డి ఫిరోజ్ పేర్కొన్నారు. నందమూరి నగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతంలో నివసిస్తున్న 20 వేల మంది ప్రజల కొరకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ సమాజానికి కేటాయించిన స్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించిన ఎన్ఎండి ఫిరోజ్ ను టిడిపి వార్డు ఇంచార్జ్ దేరెడ్డి శివనాగిరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారమే నా లక్ష్యం. నందమూరి నగర్, వైఎస్సార్ నగర్ ప్రాంతం పూర్తిగా అభివృద్ధి చెందేలా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి నాయకత్వంలో మరిన్ని కార్యక్రమాలు చేపడతాం. ప్రజల కోసం నిరంతరం పనిచేయడం నా బాధ్యతనని ఈ సందర్భంగా తెలియజేశారు . గత వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాంత అభివృద్ధికి ఏమాత్రం ప్రాధాన్యత ఇవ్వలేదని, తాను అధికారులతో చర్చించి



స్మశాన వాటిక స్థలాన్ని సర్వే చేయించడంతో పాటు, తగిన మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపి రాబోయే రోజుల్లో రాష్ట్ర మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ గారి దృష్టికి తీసుకొచ్చి హిందూ ముస్లిం క్రిస్టియన్ సమాజనికి చెందిన మూడు స్మశాన వాటికలను ఘనంగా అభివృద్ధి చేస్తామని ఈ సందర్భంగా వారికి హామినిచ్చారు. నంద్యాలలో సమాజ సమగ్రతకు, మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఇలా 3 ప్రధాన మతాలకు చెందిన నాయకులు ఇలా కలిసి ఉండటం సమాజ సమగ్రతకు, మత సామరస్యానికి నిదర్శనంగా నిలిచిందని వారు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో హిందూ సంఘాల ప్రతినిధులు, మస్జిద్ ఇమాములు, చర్చి పాస్టర్లు, వైయస్సార్ నగర్ తెలుగుదేశం పార్టీ నాయకులు , టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# వివేక హత్య కేసు నిందితుల అనుమానస్పద మరణాలు...

కడప, మార్చి 10, వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు సినిమా క్రైమ్ను తలపిస్తోంది. ఈ కేసుకు సంబంధించిన కీలక సాక్షులు, అనుమానితులు ఒకరి తర్వాత ఒకరుగా ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటి వరకు ఒకరిద్దరు కాదు, ఏకంగా ఆరుగురు మరణించారు. వీరందరి మరణాలు ఒకే రీతిన ఉండడం, అవన్నీ సహజ మరణాలుగానే రిపోర్ట్ అవుతుండడం అనుమానాలకు తావిస్తోంది. తాజాగా ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న అనుమానాస్పద స్థితిలో మరణించడం, తన తండ్రికి అందించిన వైద్య చికిత్సపై అనుమానాలు ఉన్నాయని రంగన్న కొడుకు కాంతారావు ఫిర్యాదు చేశాడు. దీంతో ఈ మరణాల వెనక సందేహాలు మరింతగా బలపడుతున్నాయి. వివేకా హత్య కేసు నిందితులే ఈ చావుల వెనక ఉన్నారనే అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో, ఈ మరణాలన్నింటిపైనా సమగ్ర దర్యాప్తు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఆయన ఓ మాజీ ఎంపీ.. అంతే కాదు.. ఓ మాజీ సీఎంకు సోదరుడు.. ఆ జిల్లాలో అతిపెద్ద రాజకీయ కుటుంబానికి ఆయన ముఖ్యనేత. అలాంటి ఆయన తన సొంతింట్లో క్రూరంగా హత్యకు గురయ్యారు. అనుమానితులున్నారు... ఆధారాలున్నాయి. సాక్ష్యాలూ ఉన్నాయి. ఆరేళ్లు అయినా ఆ కేసుకు అతీగతీ లేదు. అంతలోనే ఆ కేసుతో సంబంధం ఉన్న ఒక్కొక్కరూ చనిపోతున్నారు. అందుకే అనుమానాలు మరింత పెరుగుతున్నాయి. కడప జిల్లాలోని పలుకుబడి కలిగిన నేత వైఎస్ వివేకానంద రెడ్డి హత్య గురించే ఇదంతా అని మీకు ఇప్పటికే అర్థం అయి ఉంటుంది. చాలా కాలంగా రాజకీయ నాయకులు, మీడియా కూడా బాగా మాట్లాడి మాట్లాడి వదిలేసిన ఈ కేసు గురించి మళ్లీ చెప్పుకోవడానికి కారణం.. ఈ కేసులో ప్రధాన సాక్షి వాచ్‌మెన్ రంగయ్య మరణం. చూడటానికి సహజమరణంలానే కనిపిస్తోంది కానీ ఈ కేసులో ఇంతకు ముందు జరిగిన సంఘటనలు... కేసులోని సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోవడంతో ప్రతీ విషయాన్ని అనుమానించాల్సి వస్తోంది. ఇప్పటి వరకూ ఇలా ఆరుగురు చనిపోయారు. జనంలో అనుమానాలుండటమే కాదు.. ఇప్పుడు పోలీసుశాఖ కూడా ఈ గొలుసుకట్టు మరణాల తీగను పట్టుకుంది. మరి డొంక కదులుతుందో లేదో చూడాలి. అసలు ఈ కేసుపై ఎందుకు అనుమానాలంటే.. అప్పట్లో జరిగిన వ్యవహారాలు అలాంటివి మరి. ఆరేళ్ల కిందట వివేకా మర్డర్ జరిగిన దగ్గర నుంచి.. నిన్న రంగయ్య చనిపోయిన వరకూ అనేక మలుపులు తిరిగింది ఈ కేసు. ఈ హత్యలో ఉన్న కోణాలే కాదు.. ఆరేళ్ల కిందట రాష్ట్ర రాజకీయ రంగాన్నే మలుపతిప్పింది కూడా. అసలు ఈ మొత్తం వ్యవహారంలో ప్రతీ అడుగులోనూ ఒక్కో ట్విస్ట్ ఉంది. వరుసగా ఏం జరుగుతూ వచ్చిందో ఒక్కసారి గుర్తు చేసుకుందాం. 2019, మార్చ్ 15 తెల్లవారుజామున రక్తపుమడుగులో పడి ఉన్న వివేకానందరెడ్డిని గుర్తించారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని వచ్చి రాత్రి ఇంట్లో పడుకున్న ఆయన్ను లేపేందుకు ఆయన పీఏ కృష్ణారెడ్డి తెల్లవారుజామున ఇంటికి వెళ్లారు. ఎంతకూ నిద్రలేవకపోవడంతో వెనుక నుంచి తలుపులు తెరిచి వివేకా రక్తపు మడుగులో పడిపోయినట్లు గుర్తించారు.

నారాయణయాదవ్, జగన్ వాహన డ్రైవర్, సాక్షి :వివేకా అంత్యక్రియలకు హాజరయ్యేందుకు జగన్, భారతి రెడ్డి హైదరాబాద్ నుంచి రోడ్డు మార్గం ద్వారా పులివెందులకు వచ్చారు. అప్పుడు వారి వాహనాన్ని నడిపిన నారాయణ 2019 డిసెంబరులో చనిపోయారు. అనారోగ్యంతో మరణించాడని ప్రచారం జరిగింది. రాష్ట్ర పోలీసుల సిట్ ఎంక్వైరీ వేగం అందుకుంటున్న సమయంలో నారాయణ మరణించడం అనుమానాలకు తావిచ్చింది. హైదరాబాద్ నుంచి పులివెందుల వరకు సాగిన ప్రయాణంలో జగన్, భారతి, అవినాష్‌రెడ్డి తదితరుల మధ్య వివేకా మరణానికి సంబంధించిన ఫోన్ సంభాషణలు జరిగాయని, కారు నడుపుతున్న నారాయణ యాదవ్ అవి విన్నారనే కంప్లైంట్స్ ఉన్నాయి. దీంతో ఆయన్ను కీలక సాక్షిగా విచారించాల్సి ఉంది. అయితే, విచారణకు పిలవకముందే అతను మరణించడం అనేక అనుమానాలకు తావిచ్చింది.

బి.రంగన్న, వాచ్‌మన్, హత్య కేసులో ప్రత్యక్ష సాక్షి

వాచ్‌మన్ బి.రంగన్న వివేకా ఇంటి వద్ద కాపలా ఉండేవాడు. ఆ రోజు వివేకా హత్యలో పాల్గొన్న వారిని ఆయన ప్రత్యక్షంగా చూశారు. అంతేకాదు షేక్ దస్తగిరి, ఎర్ర గంగిరెడ్డి, ఉమాశంకరరెడ్డి, సునీల్ యాదవ్ ఈ హత్య చేసినట్టు మేజిస్ట్రేట్ ముందు, సీబీఐ ముందు వాంగ్మూలం కూడా ఇచ్చారు. రంగన్న వాంగ్మూలం తర్వాతనే అవినాష్‌రెడ్డి, శివశంకరరెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరుల ప్రమేయం వెలుగు చూసింది. ఈ హత్య గురించి బయటకు చెబితే చంపేస్తానంటూ గంగిరెడ్డి తనను బెదిరించారని కూడా రంగన్న వాంగ్మూలం ఇచ్చారు. ఆ విధంగా హత్య కేసులో అత్యంత కీలకంగా ఉన్న సాక్షి రంగన్న 2 రోజుల క్రితం అనుమానాస్పదంగా మరణించారు. తొలుత అస్వస్థతకు గురయ్యారని పులివెందుల దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించారు. తన తండ్రికి గతేడాది కాలికి గాయమైందని, పులివెందుల, కడప, హైదరాబాద్, తిరుపతి ఇలా ఎన్ని ఆసుపత్రులు తిప్పినా తగ్గలేదు. తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. చికిత్స వివరాలు అడిగితే పోలీసులు ఇవ్వలేదు. ఆ ట్రీట్మెంట్ పైన తమకు అనుమానాలున్నాయని రంగన్న భార్య, కొడుకు కాంతారావు ఆరోపిస్తున్నారు.

కల్లూరి గంగాధర్‌రెడ్డి, కీలక సాక్షి :హత్య కేసులో ముఖ్యమైన సాక్షుల్లో కల్లూరు గంగాధర్‌రెడ్డి (40) ఒకరు. ఆయన 2022 జూన్‌లో చనిపోయారు. అనారోగ్యంతో మరణించారని అప్పట్లో ప్రచారం జరిగింది. హత్య కేసు దర్యాప్తు కోసం అఃఎ బృందాలు పులివెందులలోని జగన్ క్యాంపు కార్యాలయం, వైఎస్ అవినాష్‌రెడ్డి ఇళ్లు, వివేకానందరెడ్డి నివాసం, ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి పరిసరాల్లో సోదాలు నిర్వహించారు. ఇది జరిగిన వెంటనే గంగాధర్‌రెడ్డి సందేహాస్పద స్థితిలో మరణించారు. వివేకాను హత్యను తనపై వేసుకుకుంటే రూ.10 కోట్లు ఇస్తారని దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనతో అన్నారని, ఆ ఆఫర్ను తాను తిరస్కరించానని గంగాధర్‌రెడ్డి సీబీఐకి చెప్పారు. ఆ తర్వాత మాట మార్చి సీబీఐ బలవంతం చేస్తేనే అలా చెప్పానని అన్నారు. ఆ తర్వాత కొన్నాళ్లకే గంగాధర్‌రెడ్డి అనుమానాస్పదంగా మరణించారు.

కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి, అనుమానితుడు :

వైఎస్సార్ జిల్లా కసనూరు గ్రామానికి చెందిన కటికరెడ్డి శ్రీనివాసులరెడ్డి (57) వివేకా హత్య కేసులో అనుమానితుడు. ఈ హత్య ప్లాన్ గురించి అతనికి, అతని బావ పరమేశ్వరరెడ్డికి ముందే తెలుసు అనే సందేహాలు ఉన్నాయి. పరమేశ్వరరెడ్డి నార్కో టెస్టుకు హాజరై తిరిగొచ్చిన కొన్ని రోజుల్లోనే శ్రీనివాసులరెడ్డి చనిపోయారు. రాష్ట్ర పోలీసు సిట్ ఈ కేసును విచారిస్తున్న సమయంలో 2019 సెప్టెంబరులో మరణించారు. అయితే, తన మరణానికి సిట్‌లోని ఇన్‌స్పెక్టర్ కారణమంటూ అప్పటి ముఖ్యమంత్రి జగన్ కు ఆయన రాశారని చెప్పిన రెండు లేఖల్ని పోలీసులు శ్రీనివాసుల రెడ్డి కుటుంబసభ్యుల నుంచి స్వాధీనం చేసుకున్నారు. అయితే ఆ లేఖలు ఆయన రాయలేదనే సందేహాలున్నాయి. శ్రీనివాసులరెడ్డి శరీరంలో లివర్, కిడ్నీ మధ్య భాగంలో రక్తపు ఆనవాళ్లు ఉన్నాయని ఫోరెన్సిక్ రిపోర్టు తేల్చింది. అవేంటో తేల్చకుండానే పోలీసులు కేసు మూసేశారు.

డాక్టర్ వైఎస్ అభిషేక్‌రెడ్డి, సాక్షి :వివేకా కేసులోని కీలకమైన సాక్షుల్లో వైఎస్ అభిషేక్‌రెడ్డి (36) ఒకరు. వివేకా మరణించినట్టు దేవిరెడ్డి శివశంకరరెడ్డి తనకు ఫోన్ చేశారని, వెళ్లి చూస్తే రక్తపు, వివేకా నుదుటిపై గాయాలు కనిపించాయని, ఇది హత్యగానే భావించానని 2021 ఆగస్టులో సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారు. అవినాష్‌రెడ్డి, శివశంకరరెడ్డి, ఎర్ర గంగిరెడ్డి దీన్ని గుండెపోటుగా చిత్రీకరించారని ప్రస్తావించారు. అభిషేక్‌రెడ్డి ఒక వైద్యుడు, పైగా యువకుడు. ఆయన కూడా ఈ వాంగ్మూలం ఇచ్చిన కొన్నాళ్ల తర్వాత తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఈ ఏడాది జనవరి నెలలో చనిపోయారు. ఈ మరణంపై చాలా అనుమానాలున్నాయి.

ఈసీ గంగిరెడ్డి, వైఎస్ భారతి తండ్రి :వైఎస్ భారతి తండ్రి, జగన్ సొంత మామైన ఈసీ గంగిరెడ్డి (73) 2020 అక్టోబరులో అనారోగ్యంతో మరణించారు. వివేకా హత్య గురించి ఆయనకు తెలుసనే సందేహాలు ఉన్నాయి. వివేకా మృతదేహానికి ఈసీ గంగిరెడ్డి ఆసుపత్రి సిబ్బందే కట్లు కట్టి, బ్యాండేజీలు వేశారు. నిందితులు గంగిరెడ్డి సదరు ఆసుపత్రికి వెళ్లి చేతులు కడుక్కున్నారనే ఫిర్యాదులు కూడా న్నాయి. ఆయన 2020 అక్టోబరు 3న మరణించారు. ఆయన మృతి కూడా అనుమానాస్పదంగా ఉంది.

# ప్రజా సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలి

రాయచోటి, మార్చి 10:ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో సోమవారం జిల్లా సంయుక్త కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం- పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారం పై నేరుగా పర్యవేక్షణ చేయడం జరుగుతోందన్నారు. ప్రతి సమస్యను మరియు ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ ను ప్రభుత్వం సీరియస్ గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరు శాతం పరిష్కరించాలన్నారు. ఇప్పటికే పెండింగ్లో ఉన్న బియాండ్ ఎస్ఎల్ఏ దరఖాస్తులపై వెంటనే చర్యలు తీసుకుని పరిష్కరించాలన్నారు. సమస్యను పట్టుకొని పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని సంయుక్త కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అర్జీదారులకు స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించిన జిల్లా సంయుక్త కలెక్టర్× అందజేశారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా సంయుక్త కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీ దారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ప్రజల నుండి అందిన కొన్ని విజ్ఞప్తులు× ఇలా ఉన్నాయతంబళ్లపల్లి మండలానికి చెందిన నాగరాజు నాయక్ తను వికలాంగుడినని తనకు ప్రభుత్వం వారు మూడు చక్రాల ఎలక్ట్రిక్ స్కూటర్ను ఇప్పించగలరని జిల్లా సంయుక్త కలెక్టర్కు విన్నవించుకున్నారు. రాయచోటి మండలానికి చెందిన అబ్దుల్ సత్తార్ తనకు రైతు భరోసా నగదు అందడం లేదని తనకు రైతు భరోసా అందేలా చూడగలరని జిల్లా సంయుక్త కలెక్టర్కు విన్నవించుకున్నారు. రాయచోటి మండలానికి చెందిన శేషాద్రి నాయుడు తాను ఒక ఆటో నడుపుకొని జీవనం సాగిస్తున్నానని తనకు ఇంటి స్థలం గాని ఇల్లు గాని లేదని తనకు ఇంటి స్థలం ఇప్పించవలసిందిగా జిల్లా సంయుక్త కలెక్టర్కు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మధుసూదనరావు, ఎస్ డి సి రమాదేవి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### ధర్నా చౌక్ వద్ద భారీగా పోలీసుల మోహరింపు

విజయవాడ,రాష్ట్రంలోని అంగన్వాడీ కార్య కర్తలు ఛలో విజయవాడ పిలుపునిచ్చిన నేపథ్యంలో సోమవారం గాంధీనగర్ ధర్నా చౌక్ వద్దకు పోలీసులు భారీగా చేరుకున్నారు. అంగన్వాడీ కార్యకర్తలు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విధంగా ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 10వేల మంది అంగన్వాడీలు రానున్న నేపథ్యంలో.. సత్యనారాయణపురం సీఐ లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పరిశీలించారు

### రోడ్డు ప్రమాదంలో బాధితురాలిని ఆదుకున్న మంత్రి సుభాష్

మండపేట నిమండపేట నియోజకవర్గం గుమ్ములేరు లో యాక్సిడెంట్ లో ఒక మహిళ తీవ్ర గాయాల పాలైంది. యాక్సిడెంట్ అయిన మహిళను చూసి మంత్రి సుభాష్ చలించి పోయారు. మంత్రి సుభాష్ స్వయంగా తన కాన్వాయ్ లో ఆసుపత్రిలో చేర్చారు. మెరుగైన వైద్యనీ అందించిలని డాక్టర్ కు తెలిపారు. తాను ప్రజలకు ఎప్పుడూ అండగా ఉంటానని మరోసారి ఆయన గొప్ప మనసుని చాటుకున్నారు.

### బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు

తాడేపల్లి చిర్రావూరు గ్రామంలో ప్రమాదంలో గాయపడ్డ యువకుడికి మరియు అనారోగ్యం పాలైన బాలుడికి కూటమి నేతలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. తాడేపల్లి మండల టీడీపీ జనసేన అధ్యక్షులు అమర సుబ్బారావు, సామల నాగేశ్వరరావు బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేశారు. తంకాసాల సాయి కిరణ్ మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడటంతో సీఎం రిలీఫ్ ఫండ్ కు ధరఖస్తు చేసుకున్నారు. దీంతో కిరణ్ కుటుంబానికి సిఎం రిలీఫ్ ఫండ్ 5 లక్షల 75 వేల 7 వందల 62 రూపాయలు చెక్కును అందజేశారు. అతనికి 46 వేల 9 వందల 62 రూపాయలు మంజూరైన చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంగళగిరి ఎమ్మెల్యే ఐటీ విద్య శాఖ మంత్రి నారా ల కాలీ కృష్ణ, జనసేన మండల ప్రధాన కార్యదర్శి లాల్ చందు, టీడీపీ గ్రామ ప్రధాన కార్యదర్శి పిల్లి రమేష్,ముక్కుపాటి ఏసు ప్రసాద్, మొక్కపాటి వెంకట కృష్ణ రావు,లింగాల వీరయ్య,బుల్లా రవి, మండల కార్యదర్శి హనుమ,పొంకా ముసలయ్య,పోకల శివయ్య,మేడూరి ఆదిలక్ష్మి,తోట విజయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు

# అధునాతన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను, హెల్మెట్ అవగాహనపై ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీ ని జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్

## ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములు కావాలి :జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు మార్చి 10 ( శ్రీచక్ర): ప్రకృతి వ్యవసాయంలో మహిళా సంఘాల సభ్యులు భాగస్వాములై ప్రకృతి వ్యవసాయ విస్తరణకు తోడ్పడాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాపిలుపునిచ్చారు. సోమవారం సునయన ఆడిటోరియం లో "ప్రజా భాగస్వామ్య పకృతి వ్యవసాయం – నవ సార్వత్రిక సూత్రాలు" , "ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు ఆచరించవలసిన సప్త సూత్రాలు" అన్నవాల్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విస్తరణలో మహిళా సంఘాలు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు..సంఘ సమావేశాల్లో ప్రకృతి వ్యవసాయంపై చర్చించుకోవాలని, సంఘం లోని రైతులు అందరి ప్రకృతి వ్యవసాయం చేయాలని కలెక్టర్ సూచించారు..ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. అలాగే ప్రకృతి వ్యవసాయంలో నిర్దేశించిన నవ సూత్రాలను పాటించాలని సూచించారు.. మెరుగైన వ్యవసాయ పద్ధతులు, కషాయాల ద్వారా చీడపీడలను నివారించుకోవాలని, ఎటువంటి రసాయన ఎరువులు, పురుగుమందులు, సిలింధ్ర నాశకాలు మరియు కలుపు మందులు వాడకుండా, ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పండించాలని, అధిక దిగుబడులను సాధించి, మంచి ఆదాయం పొందాలని కలెక్టర్ రైతులకు సూచించారు..ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎస్ చంద్రశేఖర్, పి ఎల్ ఎం పి లక్ష్మయ్య, ప్రాజెక్ట్ ఎగ్జిక్యూటివ్ సందీప్ కుమార్, న్యాచురల్ ఫామింగ్ అసోసియేట్ మల్లికార్జున, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య రాకుండా చూడాలి

### నగరపాలక కమిషనర్ యస్.రవీంద్ర బాబు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 13 వినతులు



కర్నూలు, మార్చి 10 (శ్రీచక్ర): వేసవికాలం ప్రారంభమైన నేపథ్యంలో తాగునీటి సమస్య రాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని నగరపాలక కమిషనర్ యస్.రవీంద్రబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి 13 అర్జీలు రాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అర్జిదారులకు కమిషనర్ హామీనిచ్చారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్.జి.వి. క్రిష్ణ, మేనేజర్ యన్.చిన్నరాముడు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కె.విశ్వేశ్వర్ రెడ్డి, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, ఎంఈ సత్యనారాయణ, ఆర్ఓ జునైద్, టిపిఆర్ఓ వెంకటలక్ష్మి, శానిటేషన్ సూపర్వైజర్ నాగరాజు, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు. గౌలిగేరి నందు తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కారణంగా నీరు వృథాగా పోతున్నాయని, తద్వారా తమకు నీరు సక్రమంగా రావడం లేదని స్థానికులు డి.నారయ్య ఫిర్యాదు చేశారు. బాబా బృందావన్ నగర్ నందు తాగునీటి సరఫరా సక్రమంగా లేక ఇబ్బందిగా ఉందని స్థానికులు యస్.వి. సుబ్బయ్య, యస్.సుబ్బమ్మ విన్నవించారు. ఇలాంటి సమస్యనే తమ కాలనీ రాజీవ్ నగర్‌లో ఉందని యం.మల్లికార్జున అర్జీ ఇచ్చారు. స్టాంటన్‌పురం నందు బైరెడ్డి ఫంక్షన్ హాలు పక్కన ప్రధాన రహదారి నుండి మ్యాప్లీ హోమ్స్ వరకు సిసి రహదారి నిర్మించాలని స్థానికులు డి.విష్ణువర్ధన్ రెడ్డి కోరారు. నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ నుండి జోహరపురం కే.సి. కెనాల్ వెళ్ళు 100 అడుగుల రహదారిని కొందరు అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, సర్వే చేసి వాటిని కాపాడాలని, అక్కడ వెంటనే రహదారి నిర్మించాలని నాల్గవ తరగతి ఉద్యోగుల కాలనీ, రాంప్రియ నగర్, యాగంటీశ్వర కాలనీ వాసులు అభ్యర్థించారు. మహావీర్ కాలనీ నందు వాహనాల వాటర్ సర్వీసింగ్ నీరు ఓ గుంతలో నిల్వ అవుతున్నాయని, అందులో పందులు స్థైర్య విహారం చేస్తున్నాయని, అక్కడ సిసి డ్రైనేజీ కాలువ నిర్మించాలని, అలాగే వీధి దీపాలు వెలగటం లేదని స్థానికులు మహేష్, పవన్ విన్నవించారు

## పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4 విధానం అమలు:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు, మార్చి 10 (శ్రీచక్ర): పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ4 విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియం లో ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం (పి4)తో "ప్రతి ఇంటికి అభివృద్ధి, ప్రతి జీవితానికి ప్రగతి" అనే వాల్ పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర–2047 విజన్ డాక్యుమెంట్లోని 10 సూత్రాల్లో మొదటి సూత్రమైన శూన్యపేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్షిప్ (పీ4) విధానానికి ఉగాది నుంచి శ్రీకారం చుట్టనుందని, ప్రభుత్వం, దాతలు, ప్రజా భాగస్వామ్యంతో పేదరికం లేని సమాజమే లక్ష్యంగా ఈ పీ4 విధానం అమలుకానుందన్నారు.. సామాజికంగా, ఆర్థికంగా పైనున్న కుటుంబాలు సామాజిక బాధ్యతగా అట్టడుగునున్న కుటుంబాలకు మద్దతుగా నిలిచేలా భాగస్వాములను చేయడం పీ4 విధానమన్నారు. దీనిపై ప్రజల సూచనలను కూడా తీసుకోవడం జరుగుతోందన్నారు. మార్చి 9 నుండి 25 వరకు క్యూఆర్ కోడ్ ను స్కాన్ చేసి లేదా హెచ్‌టీపీఎస్: //స్వర్ణాంధ్ర.ఏపీ. జీఓవీ.ఇన్/ పీ4 లింక్ ద్వారా అభిప్రాయాలు తెలియజేస్తే వారి సలహాలను ప్రశంసిస్తూ ఒక ప్రశంసా పత్రాన్ని కూడా అందచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. పి 4 విధానం కాన్సెప్ట్ ను తెలియచేస్తూ మారథాన్ వంటి కార్యక్రమాలను నిర్వహించడం, విశ్వవిద్యాలయాలు/కళాశాలలలో అవగాహనా పి4కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, సిపిఓ హిమ ప్రభాకర్ రాజు తదితరులు పాల్గొన్నారు.



### ×ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు, రహదారి భద్రత నిబంధనలపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం
### ×ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచేందేకు ఈ కార్యక్రమం





కర్నూలు, మార్చి 10 (శ్రీచక్ర): ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కు, రహదారి భద్రత నిబంధనల పై ప్రణాళిక బద్దంగా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఈ సంధర్బంగా సోమవారం కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్మెట్ అవగాహన పై ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీ, అధునాతన ట్రాఫిక్ నియంత్రణ పరికరాలను కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. విలేకరులతో జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ కర్నూలు పట్టణంలో కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 15 ఆటోలతో ట్రాఫిక్ హెల్మెట్ పై అవగాహన బ్యానర్లతో , ఒక రోజు ఆటో అనౌన్స్ మెంట్ ర్యాలీ నిర్వహించేందుకు ఆటో యూనియన్ స్వచ్ఛంధంగా ముందుకు వచ్చారన్నారు. రద్దీ ప్రాంతాలలో హెల్మెట్ పై అవగాహన చేస్తూ , సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ తో ఆటో లు తిరుగుతూ కర్నూలు పట్టణ ప్రజలకు అవగాహన కల్పిస్తాయన్నారు. కర్నూలు ఆటో యూనియన్ వారికి జిల్లా ఎస్పీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. సామాజిక భాద్యత కలిగిన దాతల సహకారంతో రద్దీ ప్రాంతాలైన బళ్ళారి చౌరస్తా, బస్టాండ్లు వంటి పలు ప్రదేశాలలో 4 అధునాతన డిజిటల్ బ్యానర్స్ ను ఏర్పాటు చేశారన్నారు. ఈ డిజిటల్ బ్యానర్స్ హెల్మెట్ ధారణ గురించి, మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే ట్రాఫిక్ నిబంధనల గురించి తెలియజేస్తాయన్నారు.రాత్రి వేళల్లో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులకు రేడియం జాకెట్స్ ను , 125 మూవబుల్ బారికేడ్స్ ను ఇవ్వడం జరిగిందన్నారు. కర్నూలు బి. క్యాంపు కు చెందిన మహిళా ఆటో డ్రైవర్ గౌతమి మాట్లాడుతూ ఇంట్లో పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఉద్యోగం చేయడం ఇష్టం లేక ఆటో యూనియన్ వారి సహాకారంతో ఆటో డ్రైవింగ్ ఫీల్డ్ ఎంచుకున్నానన్నారు. మహిళలు ఇంట్లోనే ఉండిపోకుండా ధైర్యంగా ఏదో ఒక వృత్తిలో రాణించాలన్నారు. మైనర్ పిల్లలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులను బాధలకు గురి చేస్తున్నారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించకుండా, ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వావాహనాలు నడపాలన్నారు. అనంతరం 1. సిఎంఆర్ – ప్రేమ్ రెడ్డి, సత్యనారాయణ, 2. చందన బ్రదర్స్ – నాగ మునేశ్వరరావు, శశిధర్ రెడ్డి, 3. నాగార్జున సిమెంట్ – సాంబశివారెడ్డి, సినియర్ మేనేజర్ , 4. శ్రీశైలం ఆర్ ఎం సి – కోటిరెడ్డి) దాతలకు జిల్లా ఎస్పీ జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డిఎస్పీలు బాబు ప్రసాద్, భాస్కర్ రావు, సిఐలు మన్సురుద్దీన్, తేజమూర్తి, కేశవరెడ్డి, అబ్దుల్ గౌస్, రామయ్యనాయుడు, నాగరాజా రావు, గుణశేఖర్ బాబు మరియు ట్రాఫిక్ పోలీసులు, ఆటో యూనియన్ వారు ఉన్నారు.

## అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలి

### పీజీఆర్ఎస్ లో వచ్చిన అర్జీలను వెంటనే పోర్టల్ లో నమోదు చేయండి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



కర్నూలు, మార్చి 10 అర్జీదారుడు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ సిస్టమ్ – పిజిఆర్ఎస్) కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వచ్చిన వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం వచ్చిన అర్జీలను వెంటనే పోర్టల్ లో రిజిస్టర్ చేయమని చెప్పినప్పటికీ, ఇంకా కొన్ని మండలాల్లో నమోదులో జీరో ఉండడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు..అర్జీలు వచ్చిన వెంటనే పోర్టల్ లో నమోదు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అర్జీలను నాణ్యతగా, అర్జీ దారుడు సంతృప్తి చెందే విధంగా పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..అర్జీలను క్లోజ్ చేసేటపుడు వ్యక్తిగతంగా అర్జీదారులతో మాట్లాడి, అర్జీలకు పరిష్కారం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. హెచ్ఓడీలు/ఆర్‌డిఓలు/తహశీల్దార్లు/ఎంపిడిఓలు సిఎంఓ ఫిర్యాదుల విషయంలో కూడా పౌరులను సంప్రదించకుండా ఫిర్యాదులను పరిష్కరిస్తున్నట్లు గుర్తించడం జరిగిందన్నారు..ఫిర్యాదులను పరిష్కారం చేసే సమయంలో అధికారులు అర్జీదారునితో ఖచ్చితంగా మాట్లాడి, వారికి ఎండార్స్మెంట్ అందచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అర్జీల ఎండార్స్మెంట్ ను ఆడిట్ చేయడంలో కూడా వెనుకబడి ఉన్నారని, ఆడిట్ చేయడంలో పురోగతి చూపించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..సీఎంఓ గ్రీవెన్స్ కి సంబంధించి ఆదోని సబ్ కలెక్టర్ వద్ద 18, పత్తికొండ ఆర్డిఓ వద్ద 14, కర్నూల్ ఆర్డిఓ వద్ద 16, ఏడి సర్వే వద్ద 2, పోలీసు శాఖలో 2, దేవాదాయ శాఖ, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిపిఓ, కర్నూలు డిఎస్పి, ఏపీఎమ్ఎస్ఐడిసి, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్, కర్నూల్ మున్సిపల్ కమిషనర్, ఏపీఐఐసి జెడ్ఎం లో వద్ద ఒక్కొక్క అర్జీ పెండింగ్ లో ఉన్నాయని, వాటిని గడువు లోపు, త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య రెవెన్యూ శాఖలో అర్జీలను గడువు లోపు త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్లను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటి ఘటనలో జాతీయ సంస్థలైన వీహెచ్ పీ , ఆర్ఎస్ఎస్ లపై బురదజల్లితే సహించేది లేదు

### వి హెచ్ పి రాష్ట్ర అధ్యక్షులు నందిరెడ్డి సాయిరెడ్డి





కర్నూలు, మార్చి 10 (శ్రీచక్ర): విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు కర్నూలు నగరంలోని హిందూ చైతన్య వేదిక, హిందూ బంధువులు, వివిధ క్షేత్ర కార్యకర్తలు కలిసి నిర్వ హింసించిన "నిరసన ధర్నా" లో ముఖ్య అతిథిగా విచ్చేసిన విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా రాయచోటిలో 2025 మార్చి 4వ తేదీన జరిగిన వీరభద్ర స్వామి ఆలయ పార్వేటి ఉత్సవం సందర్భంగా భక్తులు ఊరేగింపు చేస్తుండగా అన్యమతస్తులు హిందువులపై దాడి చేశారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అదుపుచేయడంలో విఫలమవడమే కాకుండా, పక్షపాతధోరణితో హిందువులపైనే అమానుషంగా లాఠీచార్జిచేసి వారిని తీవ్రంగా గాయపరిచారు. రాయచోటిలో ఊరేగింపు జరుపుకొనుటకు అన్ని అనుమతులు తీసుకొని ఉత్సవాన్ని నిర్వహించుకుంటుంటే ఆ ఉత్సవానికి ఆటంకాలు కలగకుండా చూడవలసిన బాధ్యత పోలీసులది. ప్రశాంతంగా ఉత్సవాన్ని తాము నిర్వహించుకునే హిందువులపై, ఉత్సవం పైన అన్యమతస్తులు దాడిచేస్తే, హిందువులను, హిందూ సంస్థలను బాధ్యుల్ని చేస్తూ కేసులు పెట్టడాన్ని విశ్వ హిందూ పరిషత్ తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు టి.సీ.మద్దిలేటి మాట్లాడుతూ హిందువులపైన, వారి ఉత్సవాలపైన అన్యమతస్తులు దాడులు చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారి కాదు. గత సెప్టెంబరులో చిత్తూరు జిల్లలోని వి.కోటలో హిందువులపై, కృష్ణా జిల్లాలోని పెడనలో హిందువులపైనే కాకుండా, పోలీసులు పైన కూడా దాడి చేసారు. గతంలో రాష్ట్రంలో పోలీస్ స్టేషన్ల పైన కూడా ముస్లింలు దాడులు, స్టేషన్లు కూడా దగ్ధం చేసిన విషయం తమకు విదితమే. పోలీసులు వారి ఆలోచనా స్థితిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోకపోవడం జరుగుతున్నది. దాడి చేసినప్పుడు వారిపై కేసులు నమోదు చేయకపోవడం, కేసులు పెట్టినా అరెస్టులు చేయకపోవడం, అరెస్టులు చేసినా వారికి శిక్ష పడకుండా సదరు కేసులు ప్రభుత్వమే ఉపసంహరించుకుంటున్నదిదాడులు జరిగిన ప్రతిసారీ పోలీసులు హిందువులను బాధ్యులు చేసే ప్రయత్నం చేస్తున్నారని విశ్వ హిందూ పరిషత్ భావిస్తున్నది. విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి పర్రె కోటేశ్వర రావు మాట్లాడుతూరాయచోటిలో అర్బన్ స్టేషన్ ఎస్ ఐ జే.నరసింహారెడ్డి గారు హిందువులను రెచ్చగొట్టే విధంగా ఉన్న ఆయన ప్రవర్తనను వి హెచ్ పి ఖండిస్తున్నది. హిందువులను, హిందూ సంస్థలను కించపరిచే విధంగా వారు క్రమశిక్షణ కలిగిన దేశభక్త సంస్థలైన ఆర్ ఎస్ ఎస్, వి హెచ్ పి పేర్లు పెట్టి కేసు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఈ సంఘటనలో వారి చర్యలను అనుమానించవలసి వస్తున్నది. వారు సంఘటన జరిగిన సందర్భంలో స్త్రీలను, వృద్ధులను, భక్తులను నిందాపూర్వకంగా మాట్లాడడమే కాకుండా, వారిపై విచక్షణ కోల్పోయి లాఠీచార్జి చేసి తీవ్రంగా కొట్టారు. ఒక పథకం ప్రకారం వారు హిందువులపై దాడి చేసి తిరిగి హిందువులను, హిందూ సంస్థలను కేసుల్లో ఇరికించే కుట్ర చేయడం ఒక వర్గాన్ని సంతృప్తి పరచడం కోసం చేసిన పక్షపాత చర్యగా మేము భావిస్తున్నాం. సదరు ఎస్ ఐ పెట్టిన కేసు తీరును, కేసులో వారు ప్రస్తావిస్తున్న అంశాలు చూస్తుంటే ఇది ముందస్తు ప్రణాళిక ప్రకారం జరిగిన ఒక కుట్రగా విశ్వ హిందూ పరిషత్ భావిస్తున్నది. హిందువుల పట్ల పక్షపాత ధోరణితో వ్యవహరించిన స్థానిక ఎస్ ఐని వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని విశ్వ హిందూ పరిషత్ డిమాండ్ చేస్తున్నది. హిందువుల ఉత్సవాలు ఊరేగింపులు సందర్భంగా ముస్లింలు హిందువులపై, ఉత్సవాలపై దాడులు చేస్తారనే భయంతో హిందువుల ఉత్సవాలపై రాష్ట్ర వ్యాప్తంగా పోలీసులు ఆంక్షలు పెంచడాన్ని వీ హెచ్ పి ఖండిస్తున్నది. నిన్న రాయిచోటిలో హిందువులు ఏ నినాదాలు పలకాలి, ఎవరు ఉత్సవంలో పాల్గొనాలి అని పోలీసులే పేర్కొనడం నియమాలకు విరుద్ధం. హిందూ ఉత్సవాలు , ఊరేగింపులు , శోభాయాత్రలు ,దేవీ,దేవతల ఉత్సవాలు జరిగేటప్పుడు మంగళ వాయిద్యాలు, డోలు,డప్పులు,తాళాలు,భజనలతో నిర్వహించడం ధర్మం , ఆనవాయితి అటువంటి ధర్మాన్ని ఇతర ధర్మాలకోసం మార్చేది లేదనీ, అది చట్ట విరుద్ధం కాదనీ,వారి ప్రార్థనాలయ ప్రాంగణం వెలుపల రహదారిలో వాయిద్యాలను ఆపవలసిన అవసరం లేదని తెలియజేశారు. ఇంకా మాట్లాడుతూ..మొన్న పెడన లో చుట్టుపక్కల గ్రామాల నుంచి దాడి చేయడానికి వచ్చినప్పుడు స్పందించని పోలీసులు, భగవంతుని ఉత్సవం కోసం రాయచోటిలో పరిసర గ్రామాలనుంచి పార్వేటి ఉత్సవంలో భక్తులు పాల్గొంటే మీకు రాయిచోటి రావాల్సిన అవసరం ఏమిటని పోలీసులు విశ్వ హిందూ పరిషత్ ప్రశ్నిస్తున్నదన్నారు.ఈ విషయాన్ని వెంతనే పరిష్కరించకపోతే "ఛలో రాయచోటి" కి పిలుపివ్వడానికి కూడా విశ్వ హిందూ పరిషత్ వెనుకాడదన్నారు.ఈ కా ర్యక్రమంలో లలితా పీఠం సుబ్బి స్వామి , వెల్దుర్తి ఆంజనేయ స్వామి , విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర మీడియా కన్వీనర్ మాళిగి భానుప్రకాష్,విశేష సంపర్క కన్వీనర్ ప్రతాప్ రెడ్డి,విభాగ్ వకన్వీనర్ నీలి నరసింహ, బజరంగ్ దళ్ రాష్ట్ర గోరక్షా కన్వీనర్ రాజేష్, కోశాధికారి సందడి మహేశ్వర్,సామాజిక సమరసత టోలీ సభ్యులు గోరంట్ల రమణ,హిందూ చైతన్య వేదిక అధ్యక్షులు మామిళ్ళపల్లి రాజేష్, మాధవప్రభు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను తగ్గింపులు అడగొద్దు.. కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ రిక్వెస్ట్..!

హైదరాబాద్, మార్చి 10, పన్ను తగ్గింపులు కోరవద్దని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ కార్ల పరిశ్రమకు విజ్ఞప్తి చేశారు. న్యూఢిల్లీలో జరిగిన ఓ కార్యక్రమంలో రోడ్డు రవాణా, రహదారులశాఖ మంత్రి గడ్కరీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వానికి డబ్బు అవసరమన్నారు. భారత్‌లో లాజిస్టిక్స్ ఖర్చు రెండేళ్లలోపు 9శాతానికి తగ్గుతుందన్నారు. జీఎస్టీ, ఇతర పన్నులు తగ్గించాలని డిమాండ్ చేయొద్దన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని.. పన్నులు తగ్గిస్తే.. మరింత డిమాండ్ చేస్తారన్నారు. ఇది మానవ మస్తత్వం అన్నారు. తాము పన్నులను తగ్గించాలని అనుకుంటున్నామని.. కానీ పన్నులు లేకుండా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేయలేదన్నారు. ధనవంతుల నుంచి పన్నులు తీసుకొని పేదలకు ప్రయోజనాలు కల్పించడమే ప్రభుత్వ దార్శనికత అని.. ప్రభుత్వానికి కూడా కొన్ని పరిమితులు ఉన్నాయన్నారు.ప్రస్తుతం దేశంలో లాజిస్టిక్స్ ఖర్చు 14–16 శాతంగా ఉందని.. రాబోయే రెండేళ్లలోపు లాజిస్టిక్స్ ఖర్చు 9శాతానికి తగ్గుతుందని హామీ ఇచ్చారు. దాంతో అంతర్జాతీయ మార్కెట్‌లో మరింత పోటీతత్వాన్ని కలిగి ఉంటామన్నారు. చైనాలో లాజిస్టిక్స్ ఖర్చు 8శాతం ఉండగా.. అమెరికా, యూరోపియన్ దేశాల్లో ఇది 12 శాతం ఉందని నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడకుండా భారత పరిశ్రమ ఉత్పత్తి వ్యయాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. మూలధన పెట్టుబడిని పెంచడం ద్వారా భారతదేశం మరిన్ని ఉద్యోగాలను సృష్టించబోతోందని చెప్పారు. 'మీరంతా సంపద సృష్టికర్తలు మాత్రమే కాదు.. ఉద్యోగ సృష్టికర్తలు'. ఈ స్వర్ణ యుగాన్ని మనం సద్వినియోగం చేసుకోవాలి' అంటూ పిలుపునిచ్చారు.

శ్రీచక్ర SREECHAKRA TELUGU DAILY

మంగళవారం 11 మార్చి 2025

# పి జి ఆర్ ఎస్ లో ఉచిత భోజనం.. అర్జీదారుల కళ్ళలో ఆనందం

## జిల్లా కలెక్టర్ కు ధన్యవాదములు తెలిపిన అర్జీదారులు



శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు మార్చ్ 10తమ సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కు వచ్చే అర్జీ దారుల కోసం జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ సోమవారం భోజన ఏర్పాట్లు చేయించారు.అన్న క్యాంటీన్ లకు భోజనం సరఫరా చేసే శుభోజనం వారు కలెక్టరేట్ వాన్లో భోజనం తీసుకు వచ్చి అర్జీదారులకు వడ్డించారు. అన్నం,కూర,పప్పు,పెరుగు ,స్వీట్ తో అర్జీ దారులు తృప్తిగా భోజనం చేసారు. ఇప్పటికే వచ్చె ఆర్జీదా రులకు త్రాగునీరు,వైద్య సదుపాయం, అందు బాటులో ఉంచారు.నేడు మరో అడుగు ముందుకు వేసి భోజనం ఏర్పాటు చేసారు. పేద ,ధనిక భేదం లేకుండా అందరూ తృప్తిగా భోజనం చేసారు.ప్రతి వారం దాదాపు 400-500 మంది వరకు వారి వారి సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ కు వస్తుంటారు. ఒక్కొక్కరిది ఒక్కో సమస్య. అది భూమి సంబంధం కావచ్చు, కుటుంబ సమస్యలు కావచ్చు, ఎవరూ ఆదరించడం లేదనే వృద్ధులు కావచ్చు, ఆర్ధిక సమస్యలతో భాధపడుతూ ఏదైనా ఆసరా ఇవ్వండయ్యా అని మరొకరు.. ఇలా జిల్లా నలుమూలల నుండి తమ సమస్యలు తీరుస్తారనే కొండంత ఆశ తో ప్రతి సోమవారం కలెక్టరేట్లో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు పేదలు వస్తుంటారు. రానూ పోను బస్ చార్జీలు, ఇతర ఖర్చులు భరిస్తూ, మరలా భోజనానికి ఖర్చు ఎందుకని కడుపు మాడ్చుకుని వెళ్లే వారు కొందరు....అటువంటి వారి కష్టాన్ని గుర్తించిన జిల్లా యంత్రాంగం ఈ సోమవారం అర్జీదారుల సౌకర్యార్ధం మంచి భోజనాన్ని తయారు చేయించారు. కలెక్టర్ కు అర్జీ ఇచ్చి బయటకు రాగానే ఉచిత భోజనం వడ్డించడం తో అర్జీదారుల ఆనందానికి అవధులు లేవు. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు తమ సమస్యలను సావధానం గా ఆలకించి, పరిష్కరిస్తామని హామీ ఇవ్వడమే కాకుండా, మంచి భోజనం పెట్టి కడుపు నింపారని పేదవాని ఆకలిని గుర్తించిన మనసున్న ప్రభుత్వం అంటూ వారు అనుకోవడం జరిగింది.

# క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల వైద్య శిబిరాలు ప్రచారం

## నిల్ ఆర్భాటాలకే పరిమితమవుతున్న పింక్ బస్సులు



కోటమార్చ్ 10(శ్రీచక్ర): క్యాన్సర్ నివారణ కోసం సిమ్స్ ఆధ్వర్యం లో శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ ద్వారా తిరుపతి జిల్లాలో చేస్తున్న క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపులు వల్ల పేదలకు ఎలాంటి ఉపయోగం లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోట మండలఅధ్యక్షుల ుపలగాటిసంపత్కుమార్రెడ్డి పేర్కొన్నారు .తిరుపతి జిల్లా, కోట మండలం కొక్కుపాడులో జరిగిన క్యాన్సర్ నిర్ధారణ వైద్య శిబిరంపై వైఎస్సార్సీపీ కోట మండల పార్టీ అధ్యక్షులు పలగాటి సంపత్ కుమార్ రెడ్డి మాట్లాడారు. క్యాన్సర్ ను మొదట్లోనే తెలుసుకుని అందుకు అనుగుణంగా వైద్యం అందించాలనే ఉద్దేశంతో ప్రతీ పల్లెకు పింక్ బస్సుల ఏర్పాటు చేసి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారని, అయితే వైద్య పరీక్షల గురించి పేదలకు ప్రచారం చేయడంలో వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.నిరుపేదలైన ఎస్సీ,ఎస్టీ, బీసీ కాలనీలలో పూర్తిస్థాయిలో ప్రచారం చేయడం లేదని,కొందరు నాయకులను పక్కన పెట్టుకుని ఫోటో తీసుకుని వెళ్తున్నట్లు ఆరోపించారు.పేదల కోసం జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా అందరికి సమాచారం అందించి,క్యాన్సర్ ను నిర్మూలన చేసేందుకు అధికారులు చొరవచూపాలని సంపత్ కుమార్ రెడ్డి చెప్పారు.

# కొక్కుపాడు లో మెగా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం

కోట మార్చి 10 (శ్రీ చక్ర) : కోట మండలం కొక్కుపాడు పంచాయతీలో సీనియర్ టీడీపీ నాయకులు పలగాటి భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో మెఘా ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ వైద్య శిబిరం శ్రీ బాలాజీ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అంకాలాజి శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ స్విమ్స్ వైద్యులు చే అదునాతన పరికరాలతో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో పలువురు పాల్గొని రక్త పరీక్షలును సేకరించారు.అనంతరం వారి రక్త నమూనాలును పరీక్షలు కోసంగా స్విమ్స్ ఆసుపత్రి కి పంపి ఫలితాలు తర్వాత తెలియజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పలగాటి భాస్కర్ రెడ్డి,మర్రి పోలయ్య,విూజూరు చంద్ర,శ్యాం సుందర్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



# లీజు రద్దయిన భూములపై దళితులకు యాజమాన్య హక్కు కల్పించాలి

## ఏ ఐ కె యమ్ యస్ జిల్లా అధ్యక్షుడు డి పి పోలయ్య






శ్రీచక్ర ప్రతినిధి సైదాపురం మార్చ్ 10అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం సైదాపురం మండలం, ఉటుకూరు గ్రామంలో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీ లీజు రద్దయిన భూములపై దళితులకు యాజమాన్య హక్కు కల్పించాలని, భూస్వాములు, పెత్తందారుల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను దళితలకు ఇతర పేదలకు పంచి పట్టాలు ఇవ్వాలని, పేదలు సాగుచేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం సైదాపురం తహశీల్దారు కార్యాలయము వద్ద దళితులతో కలిసి ధర్నా చేసి సైదాపురం తహశీల్దారు వారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఆ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు డి.పి పోలయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్న పేదలకు ఒక్క ఎకరము భూమిని పంచకుండా ప్రభుత్వ భూములను పరిశ్రమల పేరుతో బడా కార్పోరేట్ శక్తులకు అప్పగించడం దారుణమన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమమును చేపట్టి భూమిలేని నిరుపేదలకు భూమిని పంపిణీ చేయాలనీ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉటుకూరు గ్రామములో వెంకటకృష్ణ మైనింగ్ కంపెనీకి గ్రామ సర్వే నెం. 3,20,25-1,359 మరియు తురిమెర్ల గ్రామ సర్వే నెం. 460,461 లలో 178. ట్లు భూమిని ప్రభుత్వం మైనింగ్ లీజుకు మంజూరు చేసియున్నారు. సదరు మైనింగ్ లీజు గడువు తేది.15.08.2023 నాటికి ముగిసినది అన్నారు. సదరు భూమిలో దళితులు భూమిని ఆక్రమించి చెట్టు పుట్ట తొలగించే క్రమములో పోలీసు వారు దళితులను భూమిలోనికి వెళ్ళనివ్వకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణమే తహశీల్దారు వారు స్పందించి మైనింగు లీజు రద్దైన భూములను పరిశీలించి దళితులకు వ్యవసాయం చేసుకొనుటకు అవకాశం కల్పించి వారికి యాజమాన్య హక్కు కల్పించాలని అయన కోరారు. అలగే ఉటుకూరు గ్రామంలో భూస్వాముల ఆక్రమణలో గల ప్రభుత్వ, బంజర, మిగులు, పోరంబోకు భూములను ఆక్రమణల నుండి తొలగించి భూమి లేని నిరుపేదలకు భూమిని పంచి పట్టాలు ఇవ్వాలని అయన డిమాండ్ చేశారు. అలాగే పేదలు సాగుచేస్తున్న ప్రభుత్వ భూములకు భూపంపిణీ కార్యక్రంలో పట్టాలు మంజూరు చేయాలనీ ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని అయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమములో ఏ ఐ కే యమ్ యస్ జిల్లా నాయకులు పందిటి వెంకటయ్య, ఐ యఫ్ టి యు జిల్లా అధ్యక్షులు కె. రమేష్ , ప్రగతిశీల మహిళా సంఘం(పి ఓ డబల్యూ ) నాయకురాలు బి. మమత, పి.అనూష, ఎ.నాగమణి మరియు నాయకులు పి.పెంచలయ్య, పి. కోటయ్య, పి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలను సత్వరమే పరిష్కరించాలి

## అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఆనంద్
## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 309 అర్జీలు
## ప్రతిసోమవారం అర్జీదారులకు భోజన సదుపాయం









శ్రీచక్ర ప్రతినిధి నెల్లూరు, మార్చి 10 ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పలు సమస్యలపై ప్రజలు అందిస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్తో పాటు జాయింట్ కలెక్టర్ కార్తీక్, డిఆర్వో ఉదయభాస్కర్రావు, డ్వామా పీడీ గంగాభవాని, డిఆర్డిఎ పీడీ నాగరాజకుమారి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీలను నిర్దిష్ట గడువులోగా పరిశీలించి పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. అర్జీదారులకు భోజనం సదుపాయంప్రతిసోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదిక కార్యక్రమంలో అర్జీలు అందజేసేందుకు సుదూర ప్రాంతాల నుంచి కలెక్టరేట్కు వస్తున్న అర్జీదారులకు మధ్యాహ్నం భోజన సౌకర్యం కల్పించారు. ప్రతిసోమవారం అర్జీదారులకు మధ్యాహ్నం భోజనం అందించాలని రాష్ట్రప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేయడం పట్ల అర్జీదారులు సంతృప్తి వ్యక్తం చేశారు. లష్కర్లను నియమించాలని వినతిరైతుల పంట పొలాలకు నీళ్ల వదిలేందుకు లష్కర్లు లేనందున రైతులు చాలా నష్టపోతున్నారని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నేతలు ఎస్కె మహబూబ్, దుంపల సుబ్బారావు, కమలాకర్ కలెక్టర్కు వినతిపత్రం అందించారు. ప్రభుత్వాలు రైతులను పట్టించుకోవడం లేదని, 2023'24లో లష్కర్లు లేనందున 20 టిఎంసీల నీరు వృథా అయ్యాయని చెప్పారు. రైతుల పొలాలకు సక్రమంగా నీళ్ల అందించేందుకు వెంటనే లష్కర్లను నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటుచేయాలిరాష్ట్ర విభజన అనంతరం మన రాష్టానికి అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం లేనందున దూరవిద్య విద్యార్థులు, సిబ్బంది చాలా ఇబ్బందులుపడుతున్నారని అధ్యయన కేంద్రాల్లో పనిచేసే సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. హైదారాబాద్కు అంబేద్కర్ విశ్వవిద్యాలయం చెందినందున ఈ సంవత్సరం ఏకంగా ఆంధ్రప్రదేశ్లో అడ్మిషన్లు నిలిపివేస్తూ తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. గడిచిన మూడేళ్ల గా మన రాష్ట్రంలోని అంబేద్కర్ యూనివర్శిటీ అభ్యాసక కేంద్రాల్లో పనిచేస్తున్న పార్ట్టైం లెక్చరర్లకు, సిబ్బందికి జీతాలు కూడా నిలిపివేసినట్లు చెప్పారు. హైదరాబాద్లోని అంబేద్కర్ వర్శిటీలో అడ్మిషన్లు పొందిను సుమారు 2లక్షల మంది మన రాష్ట్ర విద్యార్థులు అనేక ఇబ్బందులుపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో మన రాష్ట్రంలోనే అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించాలని వారు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 309 అర్జీలుప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 309 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 133, మున్సిపల్శాఖకు సంబంధించి 30, సర్వేకు 13, పంచాయతీరాజ్శాఖకు 16, పోలీసుశాఖకు 43, సివిల్ సప్లయిస్కు విభాగానికి సంబంధించి 9 అర్జీలు అందాయి. ఈ అర్జీలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

# మన బీచ్ పరిరక్షణ మనందరి బాధ్యత..!

## డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు.







కాజులూరు, మార్చి 10( శ్రీచక్ర) పర్యావరణ పరిరక్షణలో భాగంగా కాకినాడ బీచ్ క్లీనింగ్ ప్రోగ్రాం చేయూత స్వచ్ఛంద సంస్థ మరియు అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ రైన్బో మరియు హోప్ ఫర్ చేంజ్ మరియు పలు స్వచ్ఛంద సంస్థలు ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ పాస్ట్ డైరెక్టర్ మరియు రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బీచ్ ని పరిశుభ్రంగా ఉంచాలని ప్లాస్టిక్ గాని మరిఏ విధమైన వ్యర్థాలను బీచ్ లో డైరెక్టా పరవేయకుండా వీలైనంత వరకు సంచులు తెచ్చుకోవటం గాని లేకపోతే దగ్గరలో ఉన్న డస్ట్ బిన్లలో వేయాలని ఇందుకోసం ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ ఆయన సందర్భంగా కోరారు. చేయూత స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు రవి మాట్లాడుతూ ఏళ్ళ తరబడి ఈ బీచ్ క్లీనింగ్ ప్రోగ్రామ్ అనేది చేస్తున్నామని ప్రస్తుతం నెల రోజుల నుంచి జిల్లా కలెక్టర్ షన్మోహన్ ఆదేశాల మేరకు ప్రతి ఆదివారం ఈ ప్రోగ్రాం పలు స్వచ్ఛందసంస్థలతో కలిసి నిర్వహిస్తున్నావన్నారు. ముఖ్యంగా బీచ్ ను ప్రతి ఒక్కరు అందంగా ఉంచడానికి సహకరించాలని కోరారు డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ సిటీ ఎమ్మెల్యే కొండబాబు మన బీచ్ ని అభివృద్ధి చేయడానికి పక్కా ప్రణాళికలు సిద్ధం చేయడం జరుగుతుందని త్వరలోనే బీచ్ ని అతి సుందరంగా తీర్చిదిద్దటంలో కూటమి ప్రభుత్వం సహకరిస్తుంది న్నారు .కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ జోన్ చైర్మన్ మరియు హోపర్ చేంజ్ సంస్థ నిర్వాహకులు లక్ష్మీ నాగేంద్ర నవసేన నిర్వాహకురాలు డాక్టర్ ఫరా కౌశల్ అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ రెయిన్బో అధ్యక్షురాలు బాల త్రిపుర సుందరి లహరి ప్రమీల దుర్గాప్రసాద్ నారాయణమూర్తి మిత్ర బృందం సుమారు 40 మంది ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

# వైఎస్ఆర్సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగాఎస్.వి.సుబ్రహ్మణ్యం రెడ్డి



కోట మార్చి10 (శ్రీచక్ర):: వైఎస్ఆర్కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగం వైఎస్ఆర్సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గూడూరు నియోజకవర్గం కు చెందిన ఎస్.వి.సుబ్రమ ణ్యం రెడ్డి నియమితులయ్యారు. అంతేకాకుండా దివంగత ముఖ్య మంత్రి,మహానేత వై.ఎస రాజశేఖర రెడ్డి హయాం నుంచి సుబ్రమ ణ్యం రెడ్డి వైఎస్ కుటుంబం వీరాభిమానిగా విధేయుడిగా ఉన్నారు. అదేవిధంగా సుబ్రహ్మణ్యం రెడ్డి పలు టీవిలలో జరిగే రాజకీయ చర్చలలో పాల్గొంటూ తనదైన రాజకీయ విశ్లేషణలతో వైఎస్ ఆర్ సీపీ గొంతుకను వినిపిస్తున్నారు.పార్టీ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.తన మేధస్సును అందిస్తూ వైకాపా పటిష్టత కు కృషి చేస్తున్నారు.ప్రస్తుతం ఆయన సేవలను గుర్తించిన పార్టీ రాష్ట్ర స్థాయిలో ఉన్నత పదవిలో నియామకం కల్పించింది.ఈ సందర్భంగా ఎస్వి.సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ తనను రాష్ట్ర కమిటీలో నియమించి పార్టీ సేవకు అవకాశం కల్పించిన తమ ప్రియతమ నాయకుడు మాజీ ముఖ్యమంత్రి వర్యులు,వైస్సార్సీపీ పార్టీ అధ్యక్షుడు వైయస్ జగన్ మోహన్ రెడ్డి,వైఎస్ఆర్సీపీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు ఈ.ఈశ్వర ప్రసాద రెడ్డి,నెల్లూరు జిల్లా అధ్యక్షులు మాజీ మంత్రి వర్యులు కాకాణి.గోవర్ధన్ రెడ్డి,గూడూరు నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ మెరుగ.మురళీధర్,తిరుపతి పార్లమెంట్ సభ్యులు మద్దిల గురుమూర్తి లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

## మీకోసంలో పది దరఖాస్తులు: ఆర్డీవో అఖిల.





రామచంద్రపురం, మార్చి 10(శ్రీచక్ర)రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారి కార్యాలయంలో సోమవారం నిర్వహించిన మీకోసం కార్యక్రమంలో 10 అర్జీలు వచ్చినట్లు. ఆర్డీవో దేవరకొండ అఖిల తెలిపారు.ఇందంలో ఆక్రమణలు తొలగించాలని ఐదు దరఖాస్తులు, 22ఎ నిషేధిత భూముల జాబితా నుండి తొలగించాలని ఒకటి, గతంలో నిర్వహించిన రీ -సర్వే నందు భూమి తక్కువగా చూపించారని మరోక దరఖాస్తు, పాస్ పుస్తకము ఇప్పించాలని ఇంకొకటి, ధరఖాస్తుదారుని భూమి రికార్డులు మార్పులు జరగకుండా చూపించాలని మరోకటి, శ్రీదేవి మత్స్యకార సంఘం పసలపూడి వారికి పంచాయితీ ద్వారా రావలసిన లీజు ఇప్పించాలని కోరుతూఒకటి మొత్తం 10 దరఖాస్తులు ధరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు

## ఫీజు పోరుకు సిద్ధం కావాలి

**పార్టీ శ్రేణులతో పోస్టర్లు విడుదల -వైసీపీ ఇన్చార్జ్ సూర్యప్రకాశ్.**





రామచంద్రపురం, మార్చి 10(శ్రీచక్ర)ఈనెల 12వ తేది బుధవారం జరగనున్న పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో పాటు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించనున్న ఫీజు ఫోరు కార్యక్రమాని నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జి, కోనసీమ జిల్లా యువజన విభాగం అధ్యక్షులు పిల్లి సూర్యప్రకాష్ పిలుపు నిచ్చారు.సోమవారం రామచంద్రపురం పట్టణ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా సూర్య ప్రకాష్ ఇక్కడకు హాజరైన పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.అనంతరం ఫీజు ఫోరుకు సంబంధించిన పోస్టర్లు విడుదల చేశారు.అలాగే కార్యక్రమానికి కాజులూరు, గంగవరం, రామచంద్రపురం మండలాలతోపాటు టౌన్, కు చెందిన వైయస్ఆర్ సిపి మండల కన్వీనర్లు, జడ్పిటిసిలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, సర్పంచులు,ఎంపీటీసీలు,మున్సిపల్చైర్మన్,వైస్ చైర్మన్, కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు, నియోజకవర్గ అనుబంధ విభాగ అధ్యక్షులు, అనుబంధ విభాగ మండల అధ్యక్షులు, వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని ఈసందర్భంగా సూర్య ప్రకాష్ కోరారు.

## అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగు చేయాలి.. కిసాన్ మేళాలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



హైదరాబాద్, మార్చి 10, (న్యూస్ పల్స్) అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంటను సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించవచ్చని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి అన్నారు. ఇవాళ నాగర్ కర్నూల్ జిల్లాలోని బిజీనేపల్లి మండలం పాలెం వ్యవసాయ పరిశోధన కేంద్రంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ ప్రాంతాల నుండి పెద్ద సంఖ్యలో పాల్గొన్న రైతుల కోసం శాస్త్రవేత్తల సమక్షంలో కిసాన్ మేళా కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యాసంగి వేరుశనగ, వరి, మొక్కజొన్న, మినుము పంటలపై అవగాహన కార్యక్రమాలు, వివిధ వ్యవసాయ అంశాలపై నమూనాల ప్రదర్శనలు, ఆధునిక వ్యవసాయ యంత్రాల డెమో ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. అదనంగా అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులు, శాస్త్రవేత్తలతో వివరణాత్మక చర్చ కార్యక్రమం కూడా ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు.ఈ అవగాహన కార్యక్రమాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని రైతులకు సూచిస్తూ.. వివిధ కంపెనీల స్టాల్స్‌ను సందర్శించారు.

# పి జి ఆర్ ఎస్ లో ప్రజలు అందజేసిన అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలి. జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి.

భీమవరం మార్చ్ 10 (శ్రీ చక్ర )సోమవారం జిల్లా కలెక్టరేట్ పి జి ఆర్ ఎస్ సమావేశ మందిరం నందు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి, జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా గత నెల రోజులుగా పి జి ఆర్ ఎస్ తాత్కాలికంగా నిలుపుదల చేసినందున, ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున అర్జీదారులు జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని అర్జీలను సమర్పించడం జరిగినది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో వచ్చిన సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా త్వరితగతిన పరిష్కారం చేయాలని తహాశీల్దార్లను ఆదేశించారు. తహాశీల్దార్లు ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్మెంట్లను ఇవ్వాలన్నారు. సంబంధిత ఆర్డీఓలు వారి పరిధిలోని మండలాలలో పర్యటించి ఎండార్స్మెంట్లను పరిశీలించాలని ఆర్డీఓలను ఆదేశించారు. రీ ఓపెన్ కి అవకాశం లేకుండా అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్కారం చేయాలన్నారు. రెవెన్యూ సదస్సులు, పి జి ఆర్ ఎస్ లో వచ్చిన అర్జీల పరిష్కారానికి తహాశీల్దార్లు వ్యక్తిగతంగా మండల పరిధిలో పర్యటించి ఆర్జీదారుల వద్ద సరైన పత్రాలను పొందడానికి నోటీసులు అందజేయాలన్నారు. ఈరోజు నిర్వహించిన పి జీ ఆర్ ఎస్ కు జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారుల నుండి 367 అర్జీలు స్వీకరించడం జరిగినదని కలెక్టర్ తెలిపారు.వాటిలో కొన్ని ఫిర్యాదులు ఈ విధంగా ఉన్నాయి భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం నుండి ఆలామంద్ర ఏసుమణి మేము భార్యా భర్తల ఇద్దరము దివ్యాంగులము మాకు ఇద్దరు ఆడపిల్లలు నాకు గొంతులో కణితి ఉంది డాక్టర్లు ఆపరేషన్ చేయాలని అన్నారు మా ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే ఎన్టీఆర్ వైద్య కార్డును మంజూరు చేయాలని కోరారు. ఆకివీడు అమృత రావు కాలనీ





స్మశాన వాటిక ఆక్రమణకు గురి అయినది చర్యలు తీసుకోవాలని శాల భాస్కరరావు ఫిర్యాదు చేశారు.భీమవరం మండలం తుందూరు గ్రామం నుండి ఆకుల వెంకటేశ్వర్లు, తన కుమార్తె కస్తూరి కృష్ణవేణి గొల్లవానితిప్ప తనను మోసం చేసి వేలిముద్రలు తీసుకుని ఆస్తి తన పేరున రాయించుకుని వృద్ధాప్యంలో ఉన్న తను చూడటం లేదని ఫిర్యాదు చేశారు.తణుకు మండలం వేల్పూరు గ్రామం కొట్టి శ్రీనివాసరావు 59 సంవత్సరాలు మూగవాడును ఒంటరిగా జీవించుచున్నాను నా తల్లి వారసత్వం నుండి వచ్చిన చిన్న ఇల్లు తప్ప ఏ ఆధారము లేదు నాకు ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ నిలిపివేశారు. పరిశీలించి పెన్షన్ మంజూరు చేయాలని కోరారు . యలమంచిలి మండలం ఏనుగువాని లంక పంచాయితీ పోలవరం గ్రామం నుండి ఇంజమూరి పుల్లయ్య నాగమణి దంపతులు పంచాయితీ గుమస్తా సుబ్బారావు పాస్ పుస్తకములు వచ్చాయి సంతకాలు పెట్టాలని నిరసరాసులమైన మమ్ములను మోసము చేసి వేలిముద్రలు తీసుకుని అక్రమముగా మాకు చెందిన భూమిని మా ఇంటి పక్కన ఉంటున్న వంపన వెంకట సుబ్బరాజుకు మా భూమి 54 సెంట్లు రాసి ఇచ్చినారు, మా భూమి మాకు ఇప్పించి చేయాలనికోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ మొగిలి వెంకటేశ్వర్లు, గ్రామ వార్డు సచివాలయం అధికారి వై.దోసి రెడ్డి, కె ఆర్ ఆర్ సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి. శివన్నారాయణ రెడ్డి, డ్వామా పిడి డా. కె సి హెచ్ అప్పారావు, వయోవృద్ధుల ట్రిబునల్ సభ్యులు మేళం దుర్గాప్రసాద్, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గర్భిణీ స్త్రీలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలి...!డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు.

కాజులూరు, మార్చి 10 ( శ్రీచక్ర)గర్భిణీ స్త్రీలు రక్తహీనత లేకుండా జాగ్రత్తలు పాటించాలని ఐరన్ పుష్కలంగా ఉండే కాయగూరలు ,పళ్ళు విరివిగా తీసుకుని ప్రతీరోజూ బెల్లం వేరుశనగలతో చేసిన అచ్చులు , గుడ్లు తక్కువ మోతాదులో మాంసం తదితర ఆహార పదార్థాలు తీసుకోవాలని అలియాన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ రాష్ట్ర శెట్టిబలిజ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు .కరప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రతినెల కార్యక్రమంలో భాగంగా అలయన్స్ క్లబ్ కాకినాడ శ్రీ పద్మ రామ్ క్లబ్ అధ్యక్షులు పెంకి శివకుమార్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పండ్లు పంపిణీ కార్యక్రమం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అలయన్స్ క్లబ్స్ గవర్నర్ అలై వనము శ్రీనివాసరావు ఉప







గవర్నర్ పెంకే గోవిందరాజు క్లబ్ ట్రెజర్ వి ప్రసాద్ కార్యదర్శివీరభద్రరావు తెలుగుదేశం పార్టీ కరప మండల అధ్యక్షులు దేవు వెంకటేశ్వరరావు వైద్యాధికారి డాక్టర్ యాంజీ లీనా హెల్త్ సూపర్వైజర్లు రాజగోపాల్ మరియు సత్యనారాయణమ్మ టెక్నీషియన్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# సావిత్రీబాయిపూలే కు భారతరత్న ఇవ్వాలి...!

**ఎంబిసి సంఘం అధ్యక్షులు యాట్ల డిమాండ్.**
**ద్రాక్షారామంలో సావిత్రి భాయి పూలే 128 వర్ధంతిలో నివాళులు.**
**బారతరత్న కోసం ప్లేకార్డులతో నినాదాలు.**

రామచంద్రపురం, మార్చి 10(శ్రీచక్ర)భారతజాతి చరిత్రలో గర్వించదగ్గ స్త్రీవాద కలికితురాయి అయినా సావిత్రిబాయి పూలే భారతరత్న ఇవ్వాలని కోరుతూ ఆమె జయంతి రోజున పలువురు ప్రయోగార్లతో నినాదాలు చేశారు. ఈసందర్భంగా అంటరాని కులాలను, మహిళలను అతి దుర్మార్గంగా హింసించిన ఆనాటి గంజాయి వనంలాంటి సమాజంలో మహిళా రక్షణకు, వారి అభ్యుదయానికి తులసి మొక్కలా ఉదయించిన మహోన్నత వ్యక్తి సావిత్రీబాయిపూలే అని నియోజకవర్గం ఎం.బి.సి సంఘం అధ్యక్షుడు యాట్ల నాగేశ్వరరావు అన్నారు. సావిత్రీబాయి పూలే 128 వర్ధంతి సంధర్భంగా ద్రాక్షారామ మసీదు సెంటర్ లో ఉన్న పూలే దంపతులు విగ్రహాలుకు ప్రజా సంఘాలు నాయకులు కొల్లపు కామేశ్వరరావు, పడిదడకల బీమ శంకరం, గారోజు సూరిబాబు, వేమవరపు రాంబాబు, పోతాబత్తుల విజయ్





కుమార్, గంపల సోమరాజు పూలమాలలు వేసి నివాళులలు అర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ మన దేశాన్ని బ్రిటిష్ వారు పరిపాలిస్తున్న సమయంలో సమాజంలోని స్త్రీలను అణచివేస్తున్న కాలంలో మహిళా అభ్యుదయానికి సావిత్రీబాయి పూలే మనస్సు లో భావాగ్ని రగిలింది. సమాజంలో అగ్రవర్ణాల ప్రజలకు మాత్రమే అందుబాటులో ఉన్న విద్యను సమాజంలో అట్టడుగువర్గాల వారికి ముఖ్యంగా స్త్రీలకు అందించాలనే సంకల్పంతో పూణే లోని బైడవాడ లో జనవరి 14వ తేదీ 1848 సంవత్సరంలో పాఠశాల ప్రారంభించింది. అటువంటి సమాజ స్త్రీ కి కేంద్ర ప్రభుత్వం తక్షణం అత్యంత ప్రతిష్టాత్మకమైన భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం భారతరత్న ఇవ్వాలని ప్లకార్డులతో నినాదం చేశారు. ఈ కార్యక్రమంలో కొట్టగల్ల భీమ శంకరం, సూదంశెట్టి గంగాధర్, బిళ్ళకుర్తి స్వామి, మేడిశెట్టి శ్రీనివాస్, షేక్ సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

## విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాంxస్వీకరించిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించిన ... జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



కర్నూలు, మార్చి 10 (శ్రీచక్ర): కర్నూల్ కొత్తపేటలోని కర్నూల్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ ప్రక్కన ఉన్న ఎస్పీ క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం కు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి మొత్తం 122 ఫిర్యాదులు వచ్చాయి. హైదరాబాదులో బిందు కన్సల్టెన్సీ పేరుతో సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి రూ. 60 వేలు తీసుకొని అశ్విని, సాయిక్రిష్ణ, హిమ బిందు కలిసి మోసం చేశారని కర్నూలు లక్ష్మీపురంకు చెందిన రమేష్ కుమార్ రెడ్డి ఫిర్యాదు చేశారు. డబ్బులు తీసుకొని ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయడం లేదని కర్నూలు చిదంబరావు స్ట్రీట్ కు చెందిన హుస్సేన్ సాబ్ ఫిర్యాదు చేశారు. కూమార్తె ఆస్తి కోసం వేధిస్తున్నదని న్యాయం చేయాలని కర్నూలు ఫరీదా బేగం ఫిర్యాదు చేశారు.తుంగభద్ర ఇండస్ట్రీ ఎంప్లాయిస్ కో ఆపరేటివ్ హౌస్ లిమిటెడ్ కర్నూలు, కల్లూరు పరిధిలో కొందరు వ్యక్తులు ఒక ఇంటికి తప్పుడు ధృవపత్రాలు సృష్టించి , రిజిస్ట్రేషన్ చేశారని కర్నూలు, స్టాంటన్ పురంకు చెందిన సుజాత ఫిర్యాదు చేశారు. నా పొలంలోకి రస్తా పోయే విధంగా చేసి నా పంటను కాపాడుకునే విధంగా న్యాయం చేయాలని దేవనకొండ మండలం తెర్నెకల్లు గ్రామానికి చెందిన రంగస్వామి ఫిర్యాదు చేశారు. అర్ధ రాత్రి దాటిన తర్వాత మా ట్రక్కు వాహనాల నుండి గుర్తు తెలియని వ్యక్తులు డిజీల్ దొంగలిస్తున్నారని న్యాయం చేయాలని కర్నూలు కోత్తపేటకు చెందిన మునవర్ భాషా ఫిర్యాదు చేశారు. మా నాన్నకు ఇద్దరు కుమారులం . మా నాన్న తెలుగు గంగ ప్రాజెక్టులో పని చేస్తూ చనిపోయాడు. తర్వాత మా నాన్న సంతకంను మా అన్న ఫోర్జరీ చేసి నాకు తెలియకుండా మా నాన్న ఉద్యోగం పొందాడని న్యాయం చేయాలని కర్నూలుకు చెందిన దేవనాయక్ ఫిర్యాదు చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఈ సందర్భంగా కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హామీ ఇచ్చారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ హుస్సేన్ పీరా, సిఐలు పాల్గొన్నారు.

# యువతను మాయ మాటలతో మభ్య పెట్టి ఓట్లు దండుకున్న.. చంద్రబాబు

**-యువత పోరు కరపత్రాలు విడుదల**
**-వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి**

మంత్రాలయం, మార్చి 10(శ్రీచక్ర) : గత ఎన్నికల సమయంలో తెలుగు దేశం పార్టీ అధినేత శ్రీ చంద్రబాబు నాయుడు విద్యార్థులను,యువతను మాయ మాటలతో మభ్య పెట్టి ఓట్లు దండుకొని, అధికారంలోకి వచ్చిన తర్వాత ఉసే లేదని వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి ఎద్దేవా చేశారు. సోమవారం వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు బాసటగా వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో యువత పోరు కరపత్రాలను వైఎస్సార్సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి విడుదల చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సూపర్ సిక్స్ హామీల్లో బాగంగా తల్లికి వందనం, నిరుద్యోగ భృతి గూర్చి బడ్జెట్ తో కేటాయింపులు జరగలేదన్నారు. తల్లికి వందనం లేక తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారని,నెల నెలా నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెప్పి,ఇవ్వకుండా యువతను మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన బాబుకు త్వరలోనే మంగళం పాడుతారని ఆయన అన్నారు. 12 న జరగబోయే యువత పోరు కార్యక్రమంలో అధిక సంఖ్యలో విద్యార్థులు విద్యార్థులు తల్లిదండ్రులు యువత పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయవలసిందిగా మంత్రాల నియోజకవర్గ ప్రజలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు వై ప్రదీప్ రెడ్డి ,మండల కన్వీనర్ బీమా రెడ్డి, జిల్లా కార్యదర్శి విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్సీపీ యూత్ విభాగం అధ్యక్షులు నరావ రాజశేఖరరెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షులు దయ్యాల మెహబూబ్,లక్ష్మన్న గురు, నరసింహ అచారి,బందే నవాజ్,మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



# స్పోర్ట్స్ న్యూస్


## ఫైనల్‌లో న్యూజిలాండ్ ఓటమికి అసలు కారణం 'అతడే' - అూఐ మాజీ ప్లేయర్‌పై విమర్శలు

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ఫైనల్‌లో న్యూజిలాండ్ 4 వికెట్ల తేడాతో ఓటమి చెందిన సంగతి తెలిసిందే. దీంతో కివీస్ జట్టు ఓటమికి గల కారణాలను క్రికెట్ అభిమానులు విశ్లేషిస్తూ సోషల్ మీడియాలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలోనే కివీస్ జట్టు ఓటమి కారణం మాజీ సీఎస్కే ప్లేయర్ అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఇంతకీ క్రికెట్ అభిమానులు చెబుతోన్న కివీస్ ఓటమికి కారణం ఏంటి, ఈ ఓటమికి ఎవరిని బాధితుడిని చేస్తున్నారో తెలుసుకుందాం..ఫైనల్ మ్యాచ్ లో మొదటి బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ జట్టును ఎదుర్కోవడానికి భారత జట్టు ఊపించినట్టుగానే స్పిన్ తో



బరిలోకి దిగి ఉచ్చుబిగించింది. అయితే కివీస్ మొదట ఇన్నింగ్స్‌ను మంచిగానే ప్రారంభించింది. అప్పుడు భారత్.. స్పిన్ మాయతో మొదట యంగ్ ను ఔట్ చేసింది. ఆ తర్వాత దాటిన ఆడిన రచిన్ రవీంద్రను కుల్దీప్ ఎంట్రీ ఇచ్చి పెవిలియన్ పంపాడు.ఆ దశలోనే నాలుగో స్థానంలో క్రీజులోకి వచ్చిన డారిల్ మిచెల్ వికెట్లు పడకుండా ఆచితూచి ఆడాడు. అక్షర్, కుల్‌దీప్, వరుణ్, జడేజా కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినా డారిల్ పట్టుదలతోనే క్రీజులోనే పాతుకుపోయాడు విలువైన భాగస్వామ్యాలతో జట్టును కాస్త అండగా నిలిచాడు. లేథమ్ (14)తో నాలుగో వికెట్‌కు 33 పరుగులు, ఫిలిప్స్ (34)తో ఐదో వికెట్‌కు 57 పరుగులు, బ్రాస్‌వెల్‌తో కలిసి ఆరో వికెట్‌కు 46 పరుగులు జోడించాడు. ఈ క్రమంలోనే 91 బంతుల్లో 50 పరుగులు చేశాడు. ఐసీసీ ఫైనల్స్ హిస్టరీలోనే అది చాలా స్లో హాఫ్ సెంచరీ. ఫైనల్ గా అతడు అనూహ్యంగా 46వ ఓవర్లో మిచెల్ ఔట్ అయ్యాడు. మొత్తంగా 101 బంతుల్లో 63 పరుగులు చేశాడు. అతడి తాబేలు లాంటి స్లో ఇన్నింగ్స్ తోనే న్యూజిలాండ్ 45వ ఓవర్ లో 200 పరుగులు దాటగలిగింది.కానీ నెటిజన్లు, కొంతమంది క్రికెట్ అభిమానులు డారిల్ కు వ్యతిరేకంగా మాట్లాడుతున్నాడు. అతడి స్లో ఇన్నింగ్స్ ను ఒప్పుకోవట్లేదు. అతడు కాస్త దూకుడుగా నైనా ఆడి ఉంటే కివీస్ ఇంకాస్త ఎక్కువ పరుగులు, కనీసం 20 పరుగులు అయినా ఎక్కువగా చేసేదని విమర్శిస్తున్నారు. అలాగే ఆ జట్టుకు గెలిచే అవకాశాలు ఎక్కువగా ఉండేవని చెబుతున్నారు.

## దిల్లీ క్యాపిటల్స్‌కు ఊహించని షాక్ - స్టార్ ప్లేయర్‌పై బ్యాన్!



ఐసీసీ ఛాంపియన్స్ 2025 ట్రోఫీ ఘనంగా ముగిసింది. మరో 12 రోజుల్లో మెగా లీగ్ ఐపీఎల్ 2025 అభిమానులను అలరించేందుకు సిద్ధమైంది. ఈ నేపథ్యంలో దిల్లీ క్యాపిటల్స్‌కు ఊహించని షాక్ తగిలింది. ఓ స్టార్ ప్లేయర్ జట్టుకు దూరం కానున్నాడు.ఈ ఐపీఎల్ సీజన్ నుంచి తాను తప్పుకుంటున్నట్లు ఇంగ్లాండ్ స్టార్?బ్యాటర్?హ్యారీ బ్రూక్ తెలిపాడు. తదుపరి సిరీస్‌ల కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు బ్రూక్ పేర్కొన్నాడు. ఈ నిర్ణయం తీసుకున్నందుకు క్షమాపణలు కూడా చెప్పాడు. అయితే ఆ మధ్య జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో రూ.6.25 కోట్ల భారీ ధరకు బ్రూక్‌ను దిల్లీ క్యాపిటల్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. పైగా బ్రూక్.. డబ్బులు పెట్టిన కొనుగోలు చేశాక ఐపీఎల్ నుంచి వైదొలగడం ఇది వరుసగా రెండో సారి. గత సీజన్ లోనూ వ్యక్తిగత కారణాలతో దూరమయ్యాడు.బీసీసీఐ కొత్త రూల్స్ ప్రకారం.. వేలంలో అమ్ముడుపోయిన ప్లేయర్, ఆ తర్వాత ఐపీఎల్ నుంచి తప్పుకోకూడదు. ముఖ్యంగా సరైన కారణంగా లేకుండా తప్పుకుంటే అతడిపై రెండేళ్ల నిషేధం పడుతుంది. కాబట్టి హ్యారీ బ్రూక్‌పై బ్యాన్ పడే అవకాశం ఉంది.

కెప్టెన్ అయ్యే ఛాన్స్..

ఛాంపియన్స్ ట్రోఫీ ఓటమి నేపథ్యంలో ఇంగ్లాండ్ వైట్ బాల్ కెప్టెన్సీకి జోస్ బట్లర్ రాజీనామా చేశాడు. అతడి స్థానంలో బ్రూక్ కొత్త కెప్టెన్ గా ఎంపికయ్యే అవకాశం ఉంది. అందుకే అతడు జట్టు కోసం ఇప్పుడు ఐపీఎల్ ను వదులుకునేందుకు సిద్ధమైనట్లు తెలిసింది.

## రోహిత్ కు హగ్ ఇచ్చిన అనుష్క శర్మ




హైదరాబాద్: మూడోసారి ఐసిసి ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచి టీమిండియా రికార్డు సృష్టించింది. ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ మ్యాచ్ లో న్యూజిలాండ్ పై భారత్ గెలవడంతో దేశ ప్రజలు సంబరాలు చేసుకున్నారు. క్రికెట్ అభిమానులు ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. టీమిండియా ఆటగాళ్లు మైదానంలో ఆనందంలో మునిగిపోయారు. తన కుటుంబ సభ్యులతో కలిసి సెలబ్రేట్ చేసుకున్నారు. మ్యాచ్ గెలిచిన వెంటనే విరాట్ కోహ్లీ తన సతీమణికి హగ్ ఇచ్చాడు.టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మకు అనుష్క శర్మ హగ్ ఇచ్చింది. ఆప్యాయంగా హత్తుకొని అతడిని అభినందించింది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారింది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

## 'కోహ్లీ,రోహిత్ తిట్లు.. అందుకే నేను స్టంప్స్ వెనక్కి వెళ్లను!' – కుల్దీప్ యాదవ్

ఛాంపియన్స్ ట్రోఫీ 2025 సెమీస్, ఫైనల్ మ్యాచ్ లో కుల్దీప్ యాదవ్.. స్టంప్స్ వెనక లేకుండా.. త్రో విసిరిన బంతిని పట్టుకోకుండా త్రో మిస్ చేసి విమర్శలకు గురైన సంగతి తెలిసిందే. ముఖ్యంగా మ్యాచ్ సమయంలో కెప్టెన్ రోహిత్, కోహ్లీ ఆగ్రహానికి గురయ్యాడు. తాజాగా మ్యాచ్ అనంతరం.. తాను స్టంప్స్ వెనక ఎందుకు వెళ్లడో, వాళ్లు ఎందుకు తనపై ఫైర్ అయ్యారో వివరించాడు కుల్దీప్ యాదవ్."వాళ్లకు (కోహ్లీ, రోహిత్) కేవలం బంతిని పట్టుకోవడమే కావాలి. జడ్డూ త్రోను బుల్లెట్ లా వేస్తాడు. దాన్ని పట్టుకోవడం చాలా కష్టం. కొన్ని సార్లు అలా జరుగుతూ ఉంటుంది. పైగా ఫైనల్ మ్యాచ్‌లో ఒత్తిడి అనేది ఉంటుంది. కానీ ప్రారంభంలోనే వికెట్ (రచిన్ రవీంద్ర) దక్కడంతో ఆత్మవిశ్వాసం వచ్చింది." అని పేర్కొన్నాడు.41వ ఓవర్‌లో కుల్దీప్ వేసిన బంతిని పాయింట్‌లోకి నెట్టిన బ్రాస్‌వెల్ ఓ సింగిల్‌ను తీసేందుకు ప్రయత్నించాడు. కానీ అప్పుడు రవీంద్ర జడేజా బుల్లెట్ స్పీడ్ తో బాల్ ను అందుకొని నాన్‌స్ట్రైకర్ వైపు విసిరాడు. అప్పుడు అది వికెట్లకు చాలా దగ్గర నుంచి వెళ్లినప్పటికీ.. అక్కడే ఉన్న కుల్దీప్ స్టంప్స్ వెనక్కి వెళ్లి బంతిని పట్టుకోలేదు. సెమీస్ మ్యాచ్ లోనూ స్టీవ్ స్మిత్ ఆడిని బంతిని ఇలానే చేశాడు. దీంతో కోహ్లీ, రోహిత్.. మ్యాచ్ సమయంలోనే అతడిని తిట్టారు. దీనికి సంబంధించిన వీడియోలు కూడా సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యాయి.



## దుబాయ్ స్టేడియంలో హార్దిక్ పాండ్యా కొత్త గర్ల్‌ఫ్రెండ్



దుబాయ్: టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా కొత్త గర్ల్‌ఫ్రెండ్.. దుబాయ్ స్టేడియంలో సందడి చేసింది. ఆదివారం చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్‌ను ఆమె స్టేడియం నుంచి వీక్షించింది. బ్రిటీష్ సింగర్, టీవీ పర్సనాల్టీ జాస్మిన్ వాలియా.. తన ఇన్‌స్టాలో ఆ స్టేడియం ఫోటోలను పోస్టు చేసింది. స్టేడియంలో కూర్చున్న ఆమె.. గీతల షర్ట్ వేసుకున్నది. దుబాయ్ స్టేడియంకు జాస్మిన్ రావడం పట్ల.. హార్దిక్ పాండ్యా తో డేటింగ్ జరుగుతోందన్న రూమర్ మరింత వ్యాపించింది.గత ఏడాది హార్దిక్, జాస్మిన్‌లు..ఒకే లొకేషన్ ఫోటోలను షేర్ చేశారు. దీంతో ఆ ఇద్దరూ డేటింగ్ జరుగుతున్నట్లు పుకార్లు షికారు చేశాయి. గ్రీసు దేశంలోని ఓ లొకేషన్ నుంచి ఆ ఇద్దరూ పిక్స్ పెట్టారు. బ్యాక్‌గ్రౌండ్ ఒకే రకంగా ఉండడంతో.. జాస్మిన్, హార్దిక్ మధ్య రిలేషన్ ఉన్నట్లు అభిమానులు ఫిక్స్ అయిపోయారుగత ఏడాది జూలైలో హార్దిక్ పాండ్యా, నటాషా స్టాంకోవిక్‌లు బ్రేకప్ అయ్యారు. వైవాహిక బంధాన్ని ముగిస్తున్నట్లు ఆ ఇద్దరూ సోషల్ మీడియా స్టేట్మెంట్ ద్వారా ప్రకటించారు. నాలుగేళ్లు కలిసి జీవిచామని, ఇప్పుడు విడిపోతున్నామని ఆమె చెప్పింది. తమ నిర్ణయం కఠినమే అయినా, విడిపోక తప్పడం లేదన్నారు.హార్దిక్ కొత్త గర్ల్‌ఫ్రెండ్ జాస్మిన్.. బ్రిటీష్ రియాల్టీ షో ద ఓన్లీ వే ఈజ్ ఎస్ఎక్స్ షోతో ఫేమస్ అయ్యింది. ఇండియాలో కూడాకు ఆమెకు ఫాలోయింగ్ ఉంది. జాక్ నైట్‌తో 2017లో చేసిన బామ్ డిగ్గీ సాంగ్ పాపులరైంది. బిగ్ బాస్ 13 ఫైనలిస్టు అసిమ్ రియాతో కలిసి జాస్మిన్ మ్యూజిక్ వీడియో చేసింది.

## చాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ మూవ్‌మెంట్..! డ్యాన్స్ చేస్తూ మాజీ కెప్టెన్ గవాస్కర్ సంబురాలు..





చాంపియన్స్ ట్రోఫీ-2025 ఫైనల్‌లో టీమిండియా విజయం సాధించింది. ఈ విజయంతో సర్వత్రా సంబురాలు వ్యక్తమయ్యాయి. అభిమానులు నృత్యాలు చేస్తూ.. డ్రమ్స్ వాయిస్తూ విజయోత్సవాలు జరుపుకున్నారు. మాజీ క్రికెటర్లు సైతం పలువురు టీమిండియా విజయం సాధించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. భారత దిగ్గజ బ్యాట్స్‌మెన్, మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ సైతం డ్యాన్స్ చేస్తూ సంబురాల్లో పాల్గొన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గవాస్కర్ ఛాంపియన్స్ ట్రోఫీకి కామెంటరీ బృందంలో సభ్యుడిగా ఉన్నారు. టీమిండియా విజయం సాధించిన సమయంలో ఆయన గ్రౌండ్‌లోనే ఉన్నారు. టీమిండియా కప్‌ను అందుకున్న సమయంలో ఆయన భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోయారు. డ్యాన్స్‌తో విజయాన్ని సెలబ్రేట్ చేసుకున్నారు. మరో వైపు టీవీ స్టూడియోలో ఉన్న మాజీ ఆటగాళ్లు హర్భజన్ సింగ్, సురేష్ రైనా సైతం తమ సీట్లలో నుంచి లేచి ఈలలు వేస్తూ.. భాంగ్రా నృత్యం చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.12 సంవత్సరాల తర్వాత టీమిండియా ఛాంపియన్స్ ట్రోఫీని గెలుచుకుంది. దుబాయి వేదికగా ఆదివారం జరిగిన ఫైనల్‌లో మొదట టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న న్యూజిలాండ్.. నిర్ణీత 50 ఓవర్లలో ఏడు వికెట్ల నష్టానికి 251 పరుగులు చేసింది. ఆ తర్వాత 252 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా.. 49 ఓవర్లలో ఆరు వికెట్ల కోల్పోయి విజయాన్ని నమోదు చేసింది. రోహిత్ శర్మ బ్యాటింగ్, స్పిన్నర్లు అద్భుతమైన బౌలింగ్ చేయడంతో భారత్ న్యూజిలాండ్‌పై నాలుగు వికెట్ల తేడాతో ఓడించి.. మూడోసారి ఛాంపియన్స్ ట్రోఫీని కైవసం చేసుకుంది. రోహిత్ కెప్టెన్సీలో 2024 టీ20 ప్రపంచకప్ తర్వాత రెండో ఐసీసీ టైటిల్‌ను భారత్ నెగ్గింది. ఇంతకు ముందు భారత జట్టు 2002, 2013 తర్వాత ఐసీసీ టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా భారత్ మూడోసారి టైటిల్‌ను నెగ్గింది. ఇప్పటి వరకు ఏ జట్టు మూడుసార్లు చాంపియన్స్ ట్రోఫీని గెలవలేదు.

## టీమిండియాపై బీసీసీఐ ప్రశంసలు.. జడేజాకు బెస్ట్ ఫీల్డర్ అవార్డు

దుబాయ్: ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ2025ని గెలుచుకున్న టీమిండియా జట్టుపై బీసీసీఐ ప్రశంసలు కురిపించింది. భారత క్రికెట్ జట్టు తన ఆధిపత్యాన్ని ప్రదర్శించిందని, ఆ హోదాలోనే విజేతగా నిలిచిందని, వన్డేలు.. టీ20ల్లో ఇండియా టాప్ ర్యాంక్ జట్టుగా కొనసాగుతున్నట్లు బీసీసీఐ ఇవాళ తన ప్రకటనలో పేర్కొన్నది. రోహిత్ సేన అత్యద్భుత ప్రదర్శన ఇచ్చిందని, అన్ని సవాళ్లను ఎదుర్కొన్నదని, నిర్భయంగా.. క్రమశిక్షణతో టోర్నీలో విజేతగా



నిలిచినట్లు బీసీసీఐ వెల్లడించింది. ప్రపంచ టోర్నీల్లో విజయకాంక్షతో భారత్ దూసుకెళ్తున్నట్లు ప్రకటనలో తెలిపారు.ఆదివారం జరిగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై ఇండియా తన సత్తా చాటినట్లు బీసీసీఐ తన ఎక్స్ అకౌంట్‌లో పోస్టు చేసిన ప్రకటనలో తెలిపింది. చరిత్రాత్మక విజయంలో కెప్టెన్ రోహిత్ శర్మ పాత్రను బీసీసీఐ విశేషంగా కొనియాడింది. రోహిత్‌లోని అసాధారణ నాయకత్వ లక్షణాలు.. జట్టును గెలుపుబాటలో నిలపడంలో సక్సెస్ అయ్యిందని ప్రకటనలో తెలిపారు. రోహిత్ నేతృత్వంలో ఇండియా రెండోసారి ఐసీసీ టైటిల్‌ను సొంతం చేసుకున్నదని బీసీసీఐ తెలిపింది. 2024 టీ20 వరల్డ్‌కప్‌తో పాటు 2025 చాంపియన్స్ ట్రోఫీ విజయంతో.. రోహిత్ ఓ సక్సెస్‌ఫుల్ కెప్టెన్ అయ్యారని పేర్కొన్నది.ప్రధాన కోచ్ గౌతం గంభీర్ పాత్రను కూడా బీసీసీఐ మెచ్చుకున్నది. గంభీర్ సాహసోపేత విధానం, వ్యూహాలు.. జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాయని పేర్కొన్నది. భారత క్రికెట్‌లో ఈ విజయం ఓ మైలురాయి అని బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ తెలిపారు. వత్తిడిలో జట్టు ఆడిన తీరు అద్భుతమని బీసీసీఐ గౌరవ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. ఐసీసీ టైటిల్‌ను గెలవడం ఎప్పటికీ ప్రత్యేకమే అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా పేర్కొన్నారు. అత్యద్భుత నైపుణ్యాన్ని, ఐక్యతను జట్టు చాటిందని బీసీసీఐ ట్రెజరర్ ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా తెలిపారు.

# డయాబెటిస్ పెషెంట్లకు గుడ్ న్యూస్: ఇకపై చౌక ధరకే ఆ షుగర్ టాబ్లెట్..!!




న్యూఢిల్లీ: దేశంలో డయాబెటిస్ వ్యాధిగ్రస్తులకు శుభవార్త! ప్రాణాంతక డయాబెటిస్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనే ఎంపాగ్లిఫ్లోజిన్ ఔషధం త్వరలోనే సామాన్యులకు అందుబాటులోకి రానుంది. అంతర్జాతీయంగా పేటెంట్ గడువు ముగియడంతో, దేశీయ ఔషధ దిగ్గజాలు ఈ మందును తక్కువ ధరకే ఉత్పత్తి చేసి విక్రయించేందుకు సిద్ధమయ్యాయి. తద్వారా డయాబెటిస్ చికిత్స ఖర్చులు భారీగా తగ్గనున్నాయి.ప్రముఖ బహుళజాతి సంస్థ బోహ్రింగర్ ఇంగెల్‌హైమ్ యొక్క ఎంపాగ్లిఫ్లోజిన్ పేటెంట్ మార్చి 11తో ముగుస్తుంది.దీంతో మ్యాన్‌కైండ్ ఫార్మా, టొరెంట్, ఆల్కెమ్, డాక్టర్ రెడ్డీస్, లుపిన్ వంటి అగ్రగామి భారతీయ ఫార్మా కంపెనీలు జెనరిక్ ఎంపాగ్లిఫ్లోజిన్‌ను విడుదల చేయడానికి పోటీ పడుతున్నాయి.దేశంలోనే నాల్గవ అతిపెద్ద ఫార్మా సంస్థ అయిన మ్యాన్‌కైండ్ ఫార్మా సంచలన ప్రకటన చేసింది. ప్రస్తుతం మార్కెట్‌లో రూ. 60 పలుకుతున్న ఒక్కో ఎంపాగ్లిఫ్లోజిన్ టాబ్లెట్‌ను కేవలం రూ. 6 కే అందించనున్నట్లు తెలిపింది. మిగిలిన జెనరిక్ కంపెనీలు కూడా రూ. 9 నుండి రూ. 14 మధ్య ధరల్లో మందులను విక్రయించే అవకాశం ఉంది. ఈ చౌక ధరల కారణంగా దాదాపు రూ. 20,000 కోట్ల విలువైన డయాబెటిస్ ఔషధ మార్కెట్‌లో పెను మార్పులు చోటుచేసుకోనున్నాయి.గతేడాది ఈ మార్కెట్ 43 శాతం వృద్ధితో రూ.14,000 కోట్ల నుండి రూ.20,000 కోట్లకు చేరుకుంది.ఈ సందర్భంగా మ్యాన్‌కైండ్ ఫార్మా అధికారి ఒకరు మాట్లాడుతూ, "అమెరికా వంటి కఠిన నిబంధనలు కలిగిన దేశాల సంస్థలచే ధృవీకరించబడిన ముడి సరుకులతో..నాణ్యమైన మందులను తక్కువ ధరకే అందించాలన్నదే మా లక్ష్యం. సొంతంగా ఉత్పత్తి చేయడం ద్వారా ఖర్చులను తగ్గించు కోగలుగుతున్నాము. పంపిణీ, మార్కెట్ వాటాను పెంచుకునేందుకు రెండు వేర్వేరు బ్రాండ్లతో విక్రయాలు జరుపుతాము" అని అన్నారు.ఎంపాగ్లిఫ్లోజిన్ మెడిసిన్ డయాబెటిస్‌తో పాటు గుండె సంబంధిత సమస్యలు, మూత్రపిండాల వ్యాధులను నివారించడంలో కూడా సమర్థవంతంగా పనిచేస్తుంది.అధిక ధర కారణంగా ఈ మందు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయింది. ఇప్పుడు జెనరిక్ రూపంలో తక్కువ ధరకే లభించనుండటంతో కోట్లాది మంది డయాబెటిస్ రోగులకు ఊరట లభించనుంది. ముఖ్యంగా భారతదేశం వంటి దేశాల్లో డయాబెటిస్ రోగుల సంఖ్య 10 కోట్లు దాటిన నేపథ్యంలో ఈ పరిణామం ఎంతో కీలకం కానుంది.ప్రస్తుతం టైప్-2 డయాబెటిస్‌కు మెట్‌ఫార్మిన్ మొదటి ప్రాధాన్య చికిత్సగా కొనసాగుతుండగా, వ్యాధి తీవ్రతను బట్టి సల్ఫోనిలురియాస్, ఇన్హిబిటర్స్, ఇన్హిబిటర్స్ వంటి మందులను వైద్యులు సూచిస్తున్నారు. సెమాగ్లుటైడ్, టిర్జెపాటైడ్ వంటి అత్యాధునిక మందులు సైతం అందుబాటులోకి వచ్చినా, ఎంపాగ్లిఫ్లోజిన్ వంటి చౌకైన జెనరిక్ మందులు పేద, మధ్యతరగతి ప్రజలకు వరంలా మారనున్నాయి. పరిమిత వైద్య బీమా సౌకర్యం ఉన్న మన దేశంలో, సొంత డబ్బులతో వైద్యం చేయించుకునే వారికి ఈ చౌక మందులు ఆర్థిక భారం తగ్గిస్తాయి.

# ఒత్తైన జుట్టు కావాలా ? హెయిర్ ఫాల్ కి చెక్ పెట్టాలా ?.. అయితే ఈ టిప్స్ మీకే !

మారుతున్న కాలానుగుణంగా వాతావరణం కూడా మారుతోంది. దీంతో ఈరోజుల్లో ఎక్కువగా ప్రతి ఒక్కరూ ఎదుర్కొంటున్న ప్రాబ్లం జుట్టు రాలడం. హెయిర్ ఫాల్ సమస్యకి చెక్ పెట్టడానికి మన జుట్టు ఆరోగ్యంగా, అందంగా కనిపించేలా ఉండడానికి హెయిర్ కేర్ పాటించడం చాలా ముఖ్యం. ఈ క్రమంలోనే జుట్టును ఆరోగ్యంగా ఉంచుకోవడానికి మనకు అందుబాటులో ఉండే వస్తువుల తోనే.. నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు.అంతే కాకుండా జుట్టు రాలే సమస్యకు పెద్దగా డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేకుండా.. ఆహారపు అలవాట్లతో కూడా చెక్ పెట్టడానికి కొన్ని టిప్స్ సూచిస్తున్నారు. ఆహారంలో క్రమం తప్పకుండా ఈ ఫ్రూట్స్ తింటే జుట్టు రాలడం , బట్టతల సమస్యను అధిగమించవచ్చు అని చెబుతున్నారు. అవేంటో మీకోసం ప్రత్యేకంగా...ఆపిల్..రోజుకు ఒక ఆపిల్ తింటే వైద్యుడిని దూరంగా ఉండవచ్చు అనే మాట అందరికీ తెలిసిందే. ఆపిల్ తినడం వల్ల వచ్చే జుట్టు మరింత బలంగా మారుతుందని.. హెయిర్ ఫాల్ తగ్గుతుందని అంటున్నారు.బొప్పాయి..జుట్టు పెరుగుదలకు ముఖ్యమైన కొల్లాజెన్ బొప్పాయిలో పుష్కలంగా లభిస్తుంది. అలానే బొప్పాయిలో ఉండే అమైనో ఆమ్లాలు , విటమిన్ సి జుట్టుకు చాలా ప్రయోజనకరంగా ఉంటాయని సూచిస్తున్నారు.జామ..విటమిన్ సి ఎక్కువగా ఉండే జామ పండ్లు తినడం వల్ల జుట్టు బలంగా పెరుగుతుంది. అంతే కాకుండా ఇది జుట్టు రాలడాన్ని నివారించడంలో, కొత్త జుట్టు పెరుగుదలను ప్రోత్సహించడంలో ఇది చాలాముఖ్య పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు.నారింజ..నారింజలో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి సహాయపడతాయి. అంతే కాకుండా జుట్టు రాలే సమస్యను తగ్గిస్తాయని అంటున్నారు. విటమిన్ బి12, విటమిన్ ఇ కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని అంటున్నారు.కివీ..కివీలో విటమిన్ సి, ఎ, కె, ఇ, లుటిన్, యాంటీ ఆక్సిడెంట్లు, జింక్, మెగ్నీషియం , భాస్వరం రక్త ప్రసరణను మెరుగుపరిచి జుట్టును బలంగా, మందంగా, అందంగా మారుస్తాయి.అంతే కాకుండా మనకు అందుబాటులో ఉండే వస్తువుల తోనే.. నిపుణులు కొన్ని చిట్కాలు సూచిస్తున్నారు. రక్త ప్రసరణను పెంచడానికి, జుట్టు కుదుళ్లకు పోషణ అందించడానికి, కొబ్బరి నూనెతో వారానికి ఒకసారి తలకు మసాజ్ చేయడం ముఖ్యమని సూచిస్తున్నారు. వేసవి కాలంలో జోజోబా ఆయిల్, చలికాలంలో ఆలివ్ ఆయిల్ జుట్టుకు అనుకూలంగా ఉంటాయని చెబుతున్నారు. ఇలా చేస్తే జుట్టు రాలే సమస్య తగ్గుతుందని వివరిస్తున్నారు.



# రోజూ గుప్పెడు ఇవి తింటే చాలు.. మీ గుండెకు డోకా లేదు!



పిస్తా పప్పులు.. చూడటానికి చిన్నగా, ముట్టుకుంటే గట్టిగా ఉన్నా, వీటిలో బోలెడన్ని పోషకాలు దాగు న్నాయి. ఇవి రుచిగా ఉండటమే కాదు, మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి అవసరమైన విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు పిస్తాలో ఉన్నాయి రోజూ గుప్పెడు పిస్తాపప్పులు తినడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. అవేంటో ఇప్పుడు చూద్దాం..పోషకాల గని:పిస్తా పప్పుల్లో మన శరీరానికి అవసరమైన అనేక పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. కండరాల నిర్మాణానికి, శరీర ఎదుగుదలకు ప్రోటీన్ చాలా అవసరం. పిస్తా పప్పుల్లో ప్రోటీన్ అధికంగా ఉంటుంది. జీర్ణక్రియను మెరుగు పరచడానికి, మలబద్ధకాన్ని నివారించడానికి ఫైబర్ సహాయపడుతుంది. ఈ పప్పులో ఇవి దండిగా ఉంటుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడే మోనో అన్‌శాచురేటెడ్, పాలీఅన్ శాచురేటెడ్ కొవ్వులు పిస్తాలో ఉంటాయి .విటమిన్ బి6, థయామిన్, విటమిన్ ఇ వంటి విటమిన్లు పిస్తాలో లభిస్తాయి. ఇవి శరీరం లోని వివిధ అవయవాల పనితీరును మెరుగుపరుస్తాయి. పొటాషియం, మెగ్నీషియం, ఫాస్పరస్, కాపర్ వంటి ఖనిజాలు పిస్తాలో ఉంటాయి. ఇవి ఎముకల ఆరోగ్యాన్ని, రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. శరీరంలోని ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే హానిని తగ్గించే యాంటీఆక్సిడెంట్లు పిస్తాలో పుష్కలంగా ఉంటాయి.గుండెకు మేలు:పిస్తా పప్పులు గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు చెడు కొలెస్ట్రాల్ (ఒఆఒ) స్థాయిలను తగ్గించి, మంచి కొలెస్ట్రాల్ స్థాయిలను పెంచుతాయి. తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. పిస్తా పప్పుల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు చాలా ఉపయోగకరం. పిస్తాలోని యాంటీఆక్సిడెంట్లు కూడా మధుమేహం వల్ల కలిగే సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి.బరువు తగ్గడానికి సహాయం:పిస్తా పప్పుల్లో ప్రోటీన్, ఫైబర్ అధికంగా ఉండటం వల్ల కడుపు నిండిన భావన కలిగి, ఎక్కువసేపు ఆకలి వేయకుండా చేస్తాయి. తద్వారా తక్కువ కేలరీలు తీసుకోవడానికి, బరువు తగ్గడానికి సహాయపడతాయి. పిస్తా పప్పుల్లో ల్యూటిన్, జియాక్సంతిన్ అనే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కంటిశుక్లం, వయసు సంబంధిత మచ్చల క్షీణత వంటి కంటి సమస్యల ప్రమాదాన్ని తగ్గిస్తాయి . పిస్తాలోని విటమిన్ ఇ, ఫోలేట్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు మెదడు పనితీరును మెరుగుపరచడానికి, జ్ఞాపకశక్తిని పెంచడానికి సహాయపడతాయి.చర్మ సౌందర్యం:పిస్తా పప్పుల్లోని విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు చర్మాన్ని ఆరోగ్యంగా, కాంతివంతంగా ఉంచడానికి సహాయపడతాయి. ఇవి చర్మంపై ముడతలు, మచ్చలను తగ్గించి, యవ్వనంగా కనిపించేలా చేస్తాయి. పిస్తా పప్పుల్లోని యాంటీఆక్సిడెంట్లు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించి, క్యాన్సర్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.పిస్తా పప్పులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అయితే, వీటిని మితంగా తీసుకోవడం మంచిది. ఎందుకంటే వీటిలో కేలరీలు కూడా ఎక్కువే ఉంటాయి. రోజుకు గుప్పెడు (సుమారు 30 గ్రాములు) పిస్తా పప్పులు తింటే సరిపోతుంది.

# వృద్ధాప్యం త్వరగా రాకుండా ఈ ఆహారాలు తినండి!


మన పూర్వీకులతో పోల్చుకుంటే మనం చాలా త్వరగా వృద్ధాప్యం బారిన పడుతున్నాం. శారీరకంగా కూడా బలహీనులుగా ఉంటున్నాం. చిన్న వయసులోనే వృద్ధాప్య ఛాయలతో ఇబ్బంది పడుతున్నాం. మనం వృద్ధాప్యం త్వరగా రాకుండా ఉండాలంటే ఆహారం విషయంలో కూడా జాగ్రత్తలు పాటించాలని, వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదించేలా చేయడానికి కొన్ని రకాల ఆహారాలు ఉపయోగపడతాయని చెబుతున్నారు వైద్య నిపుణులు. వాటి గురించి ప్రస్తుతం మనం తెలుసుకుందాం. వృద్ధాప్యాన్ని నివారించే గ్రీన్ టీ శారీరకంగా ఆరోగ్యంగా ఉండడంలో ఆహారం పాత్ర ఎంతో ఉంటుంది. రోజు మనం తీసుకోవలసిన యాంటీ ఏజింగ్ ఆహారాలను తీసుకుంటే అకాల వృద్ధాప్యాన్ని నివారించవచ్చు. అలాంటి వాటిల్లో మనం తీసుకోవలసినది గ్రీన్ టీ ఒకటి. గ్రీన్ టీ లో పాలీ ఫినాల్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి అకాల వృద్ధాప్యాన్ని నివారించడంలోనూ, దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించడంలోనూ ఎంతగానో సహాయపడతాయి. కాబట్టి గ్రీన్ టీ ని తాగడం మంచిది. "కొండలా కొలెస్ట్రాల్ పెరిగిపోతుందా?.. కరిగిపోవాలంటే ఆహారంలో దీన్ని తగ్గించండి!" కొల్లాజిన్ ఉత్పత్తిని పెంచి ఆరోగ్యకరంగా చర్మం సాల్మన్ వంటి కొవ్వు చేపలు ఒమేగా త్రీ ఫ్యాటీ యాసిడ్స్, ప్రోటీన్, సెలీనియం తదితర అనేక పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన శరీరంలో కొల్లాజిన్ ఉత్పత్తిని పెంచి ఆరోగ్యకరంగా చర్మం ఉండేలా



చేస్తాయి. ఫలితంగా చర్మం వృద్ధాప్యం బారిన పడకుండా ఎక్కువ కాలం ఉంటుంది. ఇక ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉండే డార్క్ చాక్లెట్లు కూడా చర్మాన్ని సూర్య కాంతి హాని నుండి కాపాడడంలో ముందుంటాయి. నిదానంగా చర్మ వృద్ధాప్య ప్రక్రియ చర్మ వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదించేలా చేస్తాయి. ఇక అవిసె గింజలలోనూ, ఒమేగా త్రీ ఫ్యాటీ ఆసిడ్స్, ఆల్ఫా లినోలెనిక్ ఆమ్లంతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి మన చర్మాన్ని కాపాడడానికి ఎంతగానో సహాయపడతాయి. వీటిని యూజ్ చేయడం వల్ల చర్మం తేమగా ఉంటుంది. ఇక దాని వల్ల కూడా యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. చర్మాన్ని కాపాడి వృద్ధాప్యం తగ్గించే ఆహారం ఇవి మన చర్మం మరమత్తు చేయడానికి ఎంతగానో సహాయపడతాయి. మన చర్మాన్ని సూర్యకాంతి హాని నుండి కాపాడుతాయి. ఇక పాలకూరలో బోలెడు పోషకాలు ఉంటాయి. ఈ పోషకాలు చర్మ ఆరోగ్యాన్ని కాపాడతాయి. వారానికి రెండు మూడుసార్లు పాలకూర తింటే చర్మం అందంగా మెరిసిపోతుంది.

# నేల మీద కూర్చొని భోజనం చేస్తున్నారా? అయితే ఇది మీ కోసమే!

భారతీయ సంస్కృతిలో నేల మీద కూర్చొని భోజనం చేయడం అనేది ఒక పురాతన సంప్రదాయం. ఇది కేవలం సంప్రదాయం మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ఆధునిక జీవనశైలిలో కుర్చీలు, డైనింగ్ టేబుల్స్ వచ్చాక చాలామంది నేల మీద కూర్చోవడం తగ్గించేశారు. కానీ, నేల మీద కూర్చొని భోజనం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు.జీర్ణక్రియ మెరుగుపడుతుంది: నేల మీద కూర్చొని భోజనం చేయడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మనం కింద కూర్చున్నప్పుడు, సహజంగానే కొద్దిగా ముందుకు వంగి ఉంటాం. ఈ భంగిమ కడుపులోని కండరాలను సక్రియం చేస్తుంది, తద్వారా ఆహారం సులభంగా జీర్ణం కావడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, ముందుకు వంగి, వెనక్కి వాలి భోజనం చేయడం వల్ల కడుపులో ఆమ్లాలు ఉత్పత్తి అయ్యి, ఆహారం త్వరగా జీర్ణమవుతుంది.శరీర భంగిమను మెరుగుపరుస్తుంది: నేల మీద కూర్చోవడం అనేది ఒక రకమైన యోగాసనం లాంటిది. దీనిని సుఖాసనం లేదా అర్ధ పద్మాసనం అని కూడా అంటారు. ఈ ఆసనాలు శరీరానికి సరైన భంగిమను ఇవ్వడంలో సహాయపడతాయి. వెన్నెముకను నిటారుగా ఉంచడం, భుజాలను వెడల్పుగా ఉంచడం, నడుము నొప్పిని తగ్గించడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి.రక్తప్రసరణ మెరుగుపడుతుంది: నేల మీద కూర్చొని ఉన్నప్పుడు కాళ్లు మడిచి ఉండటం వల్ల, గుండెకు రక్తప్రసరణ బాగా జరుగుతుంది. గుండె నుండి రక్తం శరీరంలోని అన్ని భాగాలకు సులభంగా చేరుతుంది. దీనివల్ల గుండె ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది.బరువు తగ్గడానికి సహాయపడుతుంది: నేల మీద కూర్చొని భోజనం చేయడం వల్ల తక్కువ ఆహారం తీసుకుంటామని అధ్యయనాలు చెబుతున్నాయి. ఎందుకంటే, కింద కూర్చున్నప్పుడు మెదడుకు త్వరగా సంకేతాలు అందుతాయి, దానివల్ల పొట్ట నిండిన భావన కలిగి తక్కువ తింటాము. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది.మానసిక ప్రశాంతత: నేల మీద కూర్చొని భోజనం చేయడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఇది ఒక ధ్యానం లాంటి ప్రక్రియ. భోజనం మీద దృష్టి పెట్టడం వల్ల ఒత్తిడి తగ్గి, మానసిక ప్రశాంతత లభిస్తుంది.





# రిస్క్ అయినా రస్క్ లో తీసుకుంటాడు!



: స్టార్ హీరోలతో కామెడీ జానర్ చిత్రాలు చేయడం అంటే ఏ డైరెక్టర్ కి అయినా సవాలే. ఆ హీరోలు ఇమేజ్ ను దాటి వచ్చి చేయాల్సిన చిత్రాలవి. అలా చేయాలంటే? కథ అంత బలంగా ఉండాలి. దర్శకుడిని అంతే విశ్వశిస్తే తప్ప సాధ్యం కాదు. సాధారణంగా కామెడీ అంటే స్టార్ హీరోలెవరు తొందరగా ముందుకురారు. ఒప్పుకున్నా ఎన్నో రకమైన కండీషన్లతో పనిచేయాల్సి ఉంటుంది. కానీ ఈ విషయంలో యంగ్ డైరెక్టర్ అనీల్ రావిపూడి నూరుశాతం సక్సెస్ అయ్యాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సూపర్ స్టార్ మహేష్ తో 'సరిలేరు నీకెవ్వరు'లో కామెడీ ఏ రేంజ్ లో పండిచాడో తెలిసిందే. ట్రైన్ ఎపిసోడ్లు సినిమాకి ఆయువు పట్టుగా నిలిచాయి. ఓవైపు సీరియస్ యాక్షన్ కథను చెబుతూనే గొప్ప కామెడీని పండించాడు. అటుపై 'భగతవంత్ కేసరి'లో నటసింహ బాలకృష్ణ పాత్రను కూడా అలాగే బ్యాలెన్స్ చేసాడు. ఓబాలయ్య అంటే యాక్షన్ తప్ప ఇంకే ముండదు. అభిమానుల ఊహకి కూడా మరో ఆలోచన రాదు. అలాంటి బాలయ్య వైవిధ్యమైన పాత్రలో ప్రేక్షకుల్ని అలరించారు. ఇక 'సంక్రాంతికి వస్తున్నాం' తో విక్టరీ వెంకటేష్ తో ఏ రేంజ్ కామెడీ చేయించారో చెప్పాల్సిన పనిలేదు. ఈ సినిమా ఏకంగా వెంకటేష్ కెరీర్ లోనే భారీ వసూళ్ల చిత్రంగా మారిపోయింది. వెంకటేష్ కామెడీతో టైమింగ్ తో పాటు బుల్లి రాజు, భాగ్యం, మీనాక్షి పాత్రలు అంతే గొప్పగా పడటంతో 300 కోట్ల వసూళ్ల చిత్రంగా రికార్డు సృష్టించింది. త్వరలో మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేస్తున్నాడు. ఇది వంద శాతం కామెడీ చిత్రమని చిరంజీవి ముందే చెప్పేసారు. ప్రేక్షకులు తన నుంచి ఎలాంటి మాస్ అప్పిరియన్స్ ఊహించొద్దని ..కేవలం తనలో కామెడీ మాత్రమే చూడటానికి రండి అని ముందే చెప్పేసారు. కొదండ రామిరెడ్డి లాంటి కామెడీ చిత్రాన్ని అనీల్ తీస్తున్నాడని చిరు అన్నారు. ఇలా స్టార్ హీరోలతో అనీల్ మార్క్ కామెడీ చిత్రాలు చేస్తూ తనకం టూ ఓ ప్రత్యేకమైన ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంటున్నాడు. మరికొంత కాలం అనీల్ కామెడీకి తిరుగుండదు.

# బ్రేక్ లేకుండానే జెట్ స్పీడ్.. ఆ రేంజ్ మాసివ్ రోల్!



రామ్ చరణ్ ప్రస్తుతం 6 షూటింగ్‌ను శరవేగంగా పూర్తి చేసే పనిలో ఉన్నాడు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమా, స్పోర్ట్స్ డ్రామాగా భారీ స్థాయిలో తెరకెక్కుతోంది. ప్రస్తుతం సినిమా షూటింగ్ బ్రేక్ లేకుండా జరుగుతోంది. మిగిలిన సినిమాల్లా పెద్దగా బ్రేక్‌లు తీసుకోకుండా టీమ్ వీలైనంత త్వరగా షూట్ కంప్లీట్ చేయాలని ఫిక్స్ అయ్యింది. అందుకే షెడ్యూల్స్ అన్నీ హై స్పీడ్‌లో ప్లాన్ చేస్తున్నారు. ఇందులోని ముఖ్యమైన అంశం ఏమిటంటే, ఈ సినిమా ఎక్కువగా ఎఈచీ ఆధారంగా వెళ్లే సినిమా కాదు కనుక, అనవసరమైన డిలే లేకుండా సాధ్యమైనంత త్వరగా షూట్ పూర్తి చేసేందుకు ప్రొడక్షన్ టీమ్ సిద్ధమైంది. బుచ్చిబాబు ప్రత్యేకంగా సినిమా కథకు తగ్గట్లే వాతావరణాన్ని సహజంగా చిత్రీకరించేలా ప్లాన్ చేశారని, అందుకే స్టూడియో సెట్స్‌కు బదులుగా ప్రకృతి ఒడిలో ఎక్కువ భాగం షూటింగ్ చేస్తున్నారట. ఇప్పటికే కొన్ని కీలక షెడ్యూల్స్ పూర్తయ్యాయిఈ సినిమా గురించి ఇండస్ట్రీలో వినిపిస్తున్న టాక్ ఏమిటంటే, "రంగస్థలం తర్వాత మళ్లీ రామ్ చరణ్ నటన గురించి అదే స్థాయిలో చర్చించుకునేలా చేస్తుంది" అని సమాచారం. ఈ సినిమా లో చరణ్ పాత్ర ఎంతో ఎమోషనల్ డెప్త్‌తో కూడుకున్నదని టాక్. ఒక పవర్‌ఫుల్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్ ఇందులో హైలైట్ కానుందని, గేమ్ ఛేంజర్‌లోని చరణ్ ఫ్లాష్‌బ్యాక్ తరహాలోనే ఈ సినిమాకు కూడా ఒక మేజర్ హైలైట్ ఉండబోతుందని తెలుస్తోంది. ఈ సినిమాలో క్రికెట్, కుస్తీ వంటి రఫ్ అండ్ మాస్ ఎలిమెంట్స్ ఉ ండబోతున్నాయి. రామ్ చరణ్ ప్రత్యేకంగా ఫిజికల్ ట్రైనింగ్ కూడా తీసుకుంటున్నాడు. ఇందులో ఆయన పాత్ర పూర్తిగా మాస్‌కి కనెక్ట్ అయ్యేలా ఉంటుందని సమాచారం. మరోవైపు జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, శివరాజ్ కుమార్, జగపతిబాబు వంటి స్టార్లు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ కాంబో కూడా సినిమాపై అంచనాలను మరింత పెంచుతోంది. , వృద్ధి సినిమాస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి నిర్మిస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ మ్యాజిక్ ఇవ్వబోతున్న విషయం తెలిసిందే. మరోవైపు బుచ్చిబాబు తన నేటివిటీ స్టైల్ కథనాన్ని, రామ్ చరణ్ మాస్ స్క్రీన్ ప్రెజెన్స్‌కు మిక్స్ చేసి, ఒక హై-ఇంటెన్స్ స్పోర్ట్స్ డ్రామాను తెరపైకి తీసుకురాబోతున్నాడు. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో భారీగా రిలీజ్ కానుంది. అతి త్వరలోనే టీజర్, ఫస్ట్ లుక్ సంబంధిత అప్‌డేట్స్ వచ్చే అవకాశముంది.

# శ్రీలీలకు చిరు సత్కారం



మెగాస్టార్ చిరంజీవి ఉమెన్స్ డే సందర్భంగా తన చెల్లెళ్లు మాధవి రావు, విజయ దుర్గ, తల్లి అంజనీదేవి, భార్య సురేఖతో కలిసి ఉన్న ఫోటోలను పోస్ట్ చేస్తూ తనతో పని చేసిన హీరోయిన్లతో పాటూ ప్రతీ ఒక్కరికీ మహిళా దినోత్సవ శుభాకాంక్షలను తెలిపిన విషయం తెలిసిందే. అయితే అదే రోజు టాలీవుడ్ హ్యాపెనింగ్ హీరోయిన్ శ్రీలీల కూడా చిరంజీవిని కలిసి మహిళా దినోత్సవాన్ని జరుపుకున్న ఫోటోలను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసి అందరికీ షాకిచ్చింది ప్రస్తుతం విశ్వంభర షూటింగ్ అన్నపూర్ణ స్టూడియోస్ లో వేసిన స్పెషల్ సెట్స్ లో జరుగుతుంది. అదే స్టూడియోలో మరో షూటింగ్ లో ఉన్న శ్రీలీల, చిరంజీవి అక్కడే ఉన్నారన్న విషయాన్ని తెలుసుకుని ఆయన్ను కలవడానికి విశ్వంభర సెట్స్ కు వెళ్లింది. ఆ రోజు ఉమెన్స్ డే కావడంతో చిరంజీవి అక్కడే శ్రీలీలను శాలువా కప్పి సన్మానించి దుర్గాదేవి ప్రతిరూపమున్న శంఖాన్ని బహుమతిగా ఇచ్చారు. ఈ విషయాన్ని స్వయంగా శ్రీలీలనే సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. ఓజీ శంకర్ దాదా ఎంబీబీఎస్ అంటూ మెగాస్టార్ తో దిగిన ఫోటోలను షేర్ చేసింది శ్రీలీల. మెగాస్టార్ ఆమెకు ఇచ్చిన ఆతిథ్యానికి ఎంతో సంబరపడిపోయిన శ్రీలీల, సెట్స్ లో తాను తిన్న రుచికరమైన ఉప్మా మరియు దోసెల గురించి కూడా ప్రస్తావించింది. ఉమెన్స్ డో రోజున చిరంజీవి గారు తనకు ఇచ్చిన బహుమతి చాలా ప్రత్యేకమని శ్రీలీల ఆ ఫోటోలను షేర్ చేస్తూ చెప్పుకొచ్చింది. ఇక శ్రీలీల నటించిన రాబిన్‌హుడ్ సినిమా రిలీజ్ కు రెడీ గా ఉంది. నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా మార్చి 28న రిలీజ్ కానుండగా, ఈ సినిమా ప్రమోషన్స్ డిఫరెంట్ గా జరుగుతూ ప్రతీ ఒక్కరినీ ఎట్రాక్ట్ చేస్తున్నాయి. దీంతో పాటూ బాలీవుడ్ లో కార్తీక్ ఆర్యన్ తో చేస్తున్న ఆషికి3 కోసం శ్రీలీల రెడీ అవుతుంది. మొత్తానికి శ్రీలీల పలు ఇండస్ట్రీల్లో తన సత్తా చాటుతూ రోజురోజుకీ మరింత బిజీగా మారిపోతుంది.

# బ్యాక్ టూ బ్యాక్ స్టార్ హీరో డబుల్ గేమ్!

కోలీవుడ్ స్టార్ సూర్యకి సరైన మాస్ థియేట్రికల్ హిట్ పడి చాలా కాలమవుతోంది. 'సింగం 3' తర్వాత అ రేంజ్ హిట్ మరోటి పడలేదు. మధ్యలో 'ఆకాశం నీహద్దురా', 'జైభీమ్' లాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. కానీ అవి ఓటీటీ రిలీజ్ లు కావడంతో? అన్ని వర్గాల ప్రేక్షకులకు ఆ సినిమాలు చేరలేదు. రెండు గొప్ప చిత్రాలే అయినా? కరోనా వైరస్ లాంటివి ఆ రెండిపై ప్రభావాన్ని చూపించాయి. 'కంగువ'తో పాన్ ఇండియాలో సంచలన మవ్వాలని చూసాడు గానీ ఆ ప్రయత్నం దారుణంగా బెడిసి కొట్టింది. దెబ్బకు మళ్లీ అలాంటి సినిమాలు చేయాలంటేనే సూర్యని ఆలోచనలో పడేస్తున్నాయి. అందుకే కొన్నాళ్ల పాటు మాస్ కంటెంట్ ఉన్న చిత్రాలు తప్ప ప్రయోగాల జోలికి వెళ్లనని సూర్య డిసైడ్ అయిపోయాడు. ప్రస్తుతం మాస్ అప్పిరియన్స్ ఉన్న కథలకే ఆసక్తి చూపిస్తున్నాడు. ఈ నేపథ్యంలో ఇప్పటికే కార్తీక్ సుబ్బరాజ్ తో 'రెట్రో' షూటింగ్ పూర్తి చేసుకున్న సంగతి తెలిసిందే. ఇదీ భారీ యాక్షన్ ఎంటర్ టైనర్. అందులోనే బలమైన ప్రేమ కథను కూడా చెబుతున్నాడు సుబ్బరాజ్. ఈ సినిమా లో సూర్య ద్విపాత్రాభినయం చేస్తున్నట్లు లీకైంది. ఇంత వరకూ ఇందులో సూర్య సింగిల్ రోల్ అనుకున్నారు. కానీ రెండు పాత్రల్లో పాత్ర డిఫరెంట్ గా ఉంటుందంటున్నారు. ఆ రోల్ చాలా ట్రిక్కీగానూ ఉంటుందిట.



# ఫెయిల్ అయిన వారసులు... ఇలా అయితే కష్టమే!

బాలీవుడ్‌లో స్టార్ కిడ్స్ హీరో హీరోయిన్స్‌గా ఎంట్రీ ఇవ్వడం కొత్తేం కాదు. అయితే వారసుల్లో సక్సెస్ రేటు చాలా తక్కువగా ఉంది. కొద్ది మంది మాత్రమే హీరో హీరోయిన్‌గా సక్సెస్ అవుతున్నారు. కొందరు ఇండస్ట్రీలో అడుగు పెట్టడం అక్కడ హిట్ రాకపోవడంతో కొన్నాళ్లు ప్రయత్నాలు చేసి కనుమరుగు అవుతున్నారు. కొందరు మాత్రం సక్సెస్‌ల కోసం ఏళ్లకు ఎళ్లు ఎదురు చూస్తున్నారు. ఇటీవల దివంగత అతిలోక సుందరి శ్రీదేవి చిన్న కూతురు ఖుషి కపూర్ హీరోయిన్‌గా పరిచయం అయింది. ఇప్పటి వరకు మూడు సినిమాల్లో నటించినా ఖుషికి హిట్ పడటలేదు. వెబ్ సిరీస్‌లోనూ నటించి తన అదృష్టంను పరీక్షించుకునే ప్రయత్నం చేసింది. కానీ ఫలితం దక్కలేదు. ! తాజాగా ఖుషి కపూర్ 'నాదానియన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాలో సైఫ్ అలీ ఖాన్ కుమారుడు ఇబ్రహీం అలీ ఖాన్ హీరోగా నటించాడు. గత రెండు మూడు సంవత్సరాలుగా ఇబ్రహీం అలీ ఖాన్ ఇండస్ట్రీ ఎంట్రీపై వార్తలు వస్తున్నాయి. ఎట్టకేలకు నాదానియన్ సినిమాతో ఎంట్రీ ఇచ్చాడు. ఇబ్రహీంకి ఇది మొదటి సినిమా కాగా ఖుషి కపూర్ మాత్రం అప్పటికే రెండు మూడు సినిమాలు నటించి ఉంది. కానీ ఆ సినిమాలు హిట్ కాకపోవడంతో ఈ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుంది. ఇబ్రహీం అలీ ఖాన్‌తో పాటు ఖుషి కపూర్‌కి సైతం 'నాదానియన్' సినిమా హిట్ అత్యంత కీలకం. అందుకే కాస్త ఎక్కువ శ్రద్ధ పెట్టి సినిమాను చేయడం జరిగింది. షానా గౌతమ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమాను నేరుగా ఓటీటీ ద్వారా ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చారు. థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి మంచి పని చేశారు. ఈ సినిమాను థియేటర్‌లో ఎలా చూస్తారు జనాలు అంటూ కొందరు విమర్శలు చేస్తున్నారు. హీరోగా ఇబ్రహీం ఇంకా చాలా మెరుగు పడాలంటూ పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. అంతే కాకుండా అతడి నటనను చాలా మంది తండ్రి సైఫ్ అలీ ఖాన్ నటనతో పోల్చుతూ కామెంట్స్ చేస్తున్నారు. ఇదెక్కడి విడ్డూరం అంటూ పలువురు పలు రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. నటనలో మినిమం ఓనమాలు కూడా నేర్చుకోలేదా అంటూ కొందరు పెదవి విరుస్తూ కామెంట్స్ చేశారు. ఇక హీరోయిన్‌గా నటించిన ఖుషి కపూర్ పై తీవ్ర విమర్శలు చేస్తున్న వారు ఉన్నారు. ఇబ్రహీం మొదటి సినిమా కనుక ఆయన తప్పులను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదు. కానీ ఖుషి కపూర్ ఇండస్ట్రీలో అడుగు పెట్టి రెండు మూడు సినిమాలు కూడా చేసింది. అయినా ఇప్పటి వరకు నటనలో మినిమం జ్ఞానం సంపాదించలేదు. అంతే కాకుండా ఖుషి స్క్రీన్ ప్రజెన్స్ అస్సలు బాగుండటం లేదు. అక్క జాన్వీ కపూర్‌తో పోల్చుతూ కొందరు ఖుషి కపూర్ అందంను తక్కువ చేసి మాట్లాడుతున్నారు. మొత్తానికి ఈ ఇద్దరు వారసులు చాలా ఆశలు పెట్టుకుని చేసిన నాదానియన్ సినిమా నిరాశ పరచడంతో భవిష్యత్తు ఏంటో అంటూ చాలా మంది చాలా రకాలుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇలా అయితే ఫ్యూచర్‌లో ఆఫర్లు రావడం కష్టమే, స్టార్‌డం దక్కడం మరింత కష్టం అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



Printed and Published and Owned by **Dr. K. HARINATHA REDDY** on behalf of **Abhyudaya Publications, cell : 098483 34101, Printed at Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh and Published From **Abhyudaya Publications,** D. No. 203 IInd Floor, SOMA Arcade, Raj Theater Road, Kurnool - 518004, Kurnool Dist., Andhra Pradesh, **Editor : Gudur Gopal**, **RNI No. APTEL/2012/46940,** e-mail: **sreechakratelugu@gmail.com.**